Crime Mirror QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
5-4-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 136

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# తెలంగాణలో మెరుగైన విద్యావ్యవస్థ

### రూపకల్పనపై ప్రభుత్వం దృష్టి

### క్షేత్రస్థాయి పరిశీలనతో పాలసీ రూపొందించాలి

### మేధావులు, అధికారులు, ఎన్జీవోలత సమీక్ష

### కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిఎం రేవంత్ సమీక్ష

తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యావ్యవస్థ రూపకల్పనకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడమని సీఎం తెలిపారు. మనకు ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని సీఎం సూచించారు.



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలని,అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సీఎం హితవు పలికారు.ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు.. తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో



## అధికారం కోసం అడ్డదారులొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, సబిత, మాగంటి గోపీనాథ్

**మోదీ సర్కారు ఎన్ని ప్రభుత్వాలను కూల్చిందో తెలుసు**

**బీజేపీ అసలు స్వరూపాన్ని జనం అర్థం చేసుకుంటున్నారు**

**ఎర్రవల్లిలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో మాజీ సీఎం కేసీఆర్**

హైదరాబాద్: ప్రజలు మెచ్చి అధికారం ఇవ్వాల్సిందే తప్ప..దాని కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం తమకు లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. రాజకీయంగా నైతిక విలువలు పాటిస్తూ ప్రజలతో మమేకమైతే మరో మూడేళ్లలో అధికారం మళ్లీ బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ మహాసభ ఏర్పాట్లకు సంబంధించి శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతలతో జరిగిన ఈ భేటీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు.

- మిగతా 2వ పేజీలో



## గ్రూప్-1 నియామకాలుకు లైన్‌క్లియర్

**జీవో 29 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత**

2లో




## అమెరికా నుంచి 682 మంది వెనక్కి రాక

**పార్లమెంటుకు నివేదించిన కేంద్రమంత్రి**

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన



## వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

**రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం**

**అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం**

**ఇది ముస్లిం, రాజ్యాంగ వ్యతిరేక బిల్లు అని ప్రతిపక్షాల ఆగ్రహం**

**బిల్లుతో లౌకిక స్ఫూర్తికి విఘాతం**

**తక్షణమే ఉపసంహరించుకోవాలి**

న్యూఢిల్లీ: దాదాపు 13 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం రాజ్యసభ ఆమోదం తెలియజేయడంతో వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు- 2025 శుక్రవారం పార్లమెంట్ ఆమోదం పొందింది. బిల్లుపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల

2లో



## టారిఫ్‌లతో పడిపోయిన ట్రంప్ గ్రాఫ్

**43 శాతానికి తగ్గిన జనామోదం**

**రక్షణ, విదేశీ విధానంపైనా పెదవి విరుపు**

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై ఎడాపెడా టారిఫ్‌లు వడ్డించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రాఫ్ బాగా పడిపోయింది. ఆయనను అధ్యక్షుడిగా అంగీకరించే

2లో



## హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

**బంగ్లా నేతకు ప్రధాని మోడీ హెచ్చరిక లాంటి సూచన**

**బ్యాంకాక్, (క్రైమ్ మిర్రర్):** బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఈ మేరకు థాయిలాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌తో భేటీలో నిర్మొహమాటంగా ఈ విషయం చెప్పారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మహ్మద్ యూనస్, భారత ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు.

## నా పోటీ సిఎం చంద్రబాబుతోనే

**ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన లోకేశ్**

**రెండోరోజూ కొనసాగిన మనిల్లు కార్యక్రమం**

**పలువురు లబ్దిదారులకు పట్టాలు పంపిణీ**



అమరావతి, **(క్రైమ్ మిర్రర్):** నా పోటీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే' అంటూ విద్య, ఐటీ–, ఎలక్ట్రానిక్స్ శాఖల నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మన ఇల్లు - మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నీరుకొండ గ్రామానికి చెందిన 99 మందికి, రత్నాల చెరువుకు చెందిన 199 మందికి శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ పంపిణీ చేవారు.

2లో

## ఉమ్మడి ఎపిలో ఉన్న దుర్భిక్షం

**కెసిఆర్ పాలనలో సాగునీటికి ఢోకా లేదు**

**ధాన్యం కొనుగోళ్లు లేక రైతుల అవస్థలు**

**మీడియా సమావేశంలో జగదీశ్ రెడ్డి విమర్శలు**



**నల్లగొండ (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో 2014 కంటే ముందు ఉన్న దుర్భిక్షం మళ్లీ నెలకొన్నదని, కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చిందని మాజీ మంత్రి,

# హిందువుల రక్షణపై దృష్టి పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

థాయ్‌లాండ్ బ్యాంకాక్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు నాయకులు సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య సానుకూల, నిర్మాణాత్మక సంబంధం అవసరారన్ని ప్రధాని మోడీ యూనస్‌కి తెలియజేశారు. అదే సమయంలో పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటాన్ని నివారించాలని కోరారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ విలేకరుల సమావేశంలో చెప్పారు. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల గురించి యూనస్ వ్యాఖ్యలు చేసిన కొన్ని రోజుల తర్వాత ప్రధాని మోడీ నుంచి యూనస్‌కి హెచ్చరిక లాంటి సూచన రావడం గమనార్హం. ఇటీవల ఈశాన్య రాష్ట్రాలలోకి మీ ప్రభావాన్ని విస్తరించాలని చైనాను యూనస్ కోరుతున్న వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. యూనస్ తీరుపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా, మోడీ-యూనస్ భేటీలో బంగ్లాదేశ్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ నిబద్ధతను ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. గతేడాది షేక్ హసీనా పదవి నుంచి దిగిపోయినప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు జరిగాయి. ఈ దాడుల పట్ల భారత్ తన అభ్యంతరాన్ని బంగ్లాదేశ్‌కి తెలిపింది. దాడులను అడ్డుకోవాలని సూచించింది. ఈ భేటీలో ప్రజాస్వామ్య, స్థిరమైన, శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారతదేశం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బంగ్లాదేశ్‌తో సానుకూల మరియు నిర్మాణాత్మక సంబంధాన్ని ఏర్పరచుకోవాలనే భారతదేశం ఆకాంక్షను ప్రొఫెసర్ యూనస్ నొక్కిచెప్పారని మిస్రి అన్నారు. సరిహద్దు భద్రతపై ఇద్దరు నేతలు చర్చించారు. అక్రమ చొరబాటు-లను నిరోధించడానికి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రధాని మోడీ చెప్పారు. బంగ్లాదేశ్ లోని హిందువులు సహా మైనారిటీ-ల భద్రతపై ప్రధాని తన ఆందోళన వ్యక్తం చేసినట్లు- మిస్రీ వెల్లడించారు.

# గ్రూప్-1 నియామకాలుకు లైన్‌క్లీయర్

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** గ్రూప్-1 నియామకాలుకు లైన్‌క్లీయర్ అయ్యింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీవో 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న తెలంగాణ ప్రభుత్వం జీవో 29ని జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా పిటిషన్ కొట్టివేతతో గ్రూప్ 1 నియామకాలకు అడ్డంకి తొలగింది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది. త్వరలో 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన చేయనుంది.

# నా పోటీ సీఎం చంద్రబాబుతోనే

మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో మన ఇల్లు మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ అందజేశారు. యర్రబాలెం గ్రామానికి చెందిన 248 మందికి శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం నీరుకొండ గ్రామానికి చెందిన 99మందికి, రత్నాల చెరువు కు చెందిన - 199 మందికి శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈరోజు మొత్తం 546 మంది లబ్దిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను ఉచితంగా అందజేశారు. సొంత ఖర్చులతో బట్టలు పెట్టి మరీ లబ్ధిదారులకు ఇంటి పట్టాలను మంత్రి లోకేష్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతీ విషయంలో చంద్రబాబుతో పోటీపడేందుకు ప్రయత్నిస్తానన్నారు. కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుందని చంద్రబాబుతో చేసిన ఛాలెంజ్ నిలబెట్టుకున్నానని హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని పనిచేస్తానన్నారు. మంగళగిరిలో రానున్న రోజుల్లో కరెంట్ తీగలు కనిపంచవని చెప్పుకొచ్చారు. భూగర్భ విద్యుత్‌తో పాటు-, భూగర్భ డ్రైనేజ్, భూగర్భ గ్యాస్ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. స్వచ్ఛ భారత్‌లో మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి కోసం ప్రజలందరి సహకారం అవసరమన్నారు. ఎవరూ ఇళ్ల ముందు చెత్త వేయొద్దన్నారు. ఎవరైనా ఇంటి ముందు చెత్త వేస్తే వారితో కలిసి తానూ ఆ చెత్త ఎత్తుతానని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో రూ.వెయ్యి కోట్ల విలువైన ఆస్తిపై శాశ్వత హక్కు మంగళగిరి ప్రజలకు కల్పిస్తున్నామన్నారు. తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పానని.. తాను ఎక్కడికి వెళ్లినా మంగళగిరి తన గుండెల్లో ఉంటు-ందని వెల్లడించారు. సూపర్ 6 హామీలు ఓ పద్ధతి ప్రకారం అమలు చేస్తూనే... మంగళగిరిలో ఏ సమస్యా లేకుండా చూసుకుంటామన్నారు. కుప్పంతో పాటు- మంగళగిరిని కూడా తెలుగుదేశం కంచుకోటగా మారుస్తా అని చంద్రబాబుకు ఇచ్చిన హామీ నిలబెట్టు-కున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి పేదలకు ఇంటి పట్టాల పంపిణీ రెండున్నర దశాబ్దాల కల అని చెప్పుకొచ్చారు. ఓడిన చోటే గెలిచి చూపాలని మంగళగిరిపై ప్రత్యేక దృష్టి సారించి 26 సంక్షేమ కార్యక్రమాలు ప్రతిపక్షంలో ఉండగా అమలు చేశానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తీవ్రస్థాయిలో వాద ప్రతివాదనలు జరిగాయి. ప్రతిపక్షాలు దీన్ని ముస్లిం వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించాయి. ముస్లింలకు చెందిన ఆస్తులను చేజిక్కించుకుని వాటిని కార్పొరేషన్లకు అప్పగించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని ఆరోపించాయి. బిల్లుతో లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని, తక్షణమే బిల్లును ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. దురుద్దేశంతోనే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని, దీన్ని ఉపసంహరించాలని కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, శివసేన(యూబీటీ)తోపాటు, ఇతర ప్రతిపక్షాలు డిమాండు చేశాయి. 128 మంది సభ్యులు అనుకూలంగా, 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేయడంతో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందింది. గురువారమే ఈ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ముసల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు, 2025కి కూడా రాజ్యసభ శుక్రవారం ఆమోదం తెలిపింది.

**కొద్దిమంది ముస్లిమేతరులు ఉన్నంత మాత్రాన..**

బిల్లుపై చర్చ సందర్భంగా మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రసంగిస్తూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు బిల్లుపై ముస్లిం సమాజాన్ని భయపెడుతున్నాయని ఆరోపించారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ లక్ష్యంతో అన్ని వర్గాల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. వక్ఫ్ బోర్డు ఓ చట్టబద్ధ సంస్థని, అన్ని ప్రభుత్వ సంస్థల మాదిరిగానే అది కూడా లౌకికవాదంతో పనిచేయాలని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డులో కొద్ది మంది ముస్లిమేతరులు ఉన్నంత మాత్రాన బోర్డు నిర్ణయాల్లో మార్పులు జరగబోవని, పైగా వాటికి విలువ చేకూరుతుందని రిజిజు చెప్పారు. ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లులో జేపీసీ, ఇతర భాగస్వాములు చేసిన అనేక సూచనలను చేర్చామని ఆయన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును సవాలు చేస్తూ ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావేద్ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు, 2025పై రాష్ట్రపతి సంతకం చేయవలసి ఉంది. ముస్లింలు, ముస్లిం సమాజానికి చెందిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా వక్ఫ్ బిల్లులోని నిబంధనలను ఒవైసీ తన పిటిషన్‌లో అభివర్ణించారు. బడ్జెట్ సమావేశాలకు తెరదించుతూ పార్లమెంట్ ఉభయ సభలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. జనవరి 31న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. వక్ఫ్ బిల్లుపై దేశ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నదని రాజ్యసభలో బీఆర్‌ఎస్ పక్ష నేత, ఎంపీ సురేశ్‌రెడ్డి చెప్పారు. ఈ బిల్లు కొన్ని వర్గాలకు నష్టం చేస్తుందన్నారు. బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ అభివృద్ధి ముసుగులో ఒక వర్గాన్ని ఏకం చేసే కుట్రకు కేంద్రం తెరలేపిందన్నారు. ఈ బిల్లుపై దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర ప్రాంతాల్లోని వక్ఫ్ బోర్డు బాధ్యులను చర్చలకు పిలిచి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బిల్లులో సంస్కరణలు చేయాలని సూచించారు. లేకపోతే భారత లౌకిక, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఓ సీఎం సర్వే నిర్వహించి విద్యుత్తు, దేవాదాయ శాఖల్లో తీవ్రమైన అవినీతి ఉందని గుర్తించారని తెలిపారు. తదనంతరం అవినీతిని అరికట్టేందుకు పాలనా పరమైన సంస్కరణలు తెచ్చారని చెప్పారు. అదే తరహాలో మైనార్టీల్లో కూడా సంస్కరణలు తేవాలని ఆశిస్తున్నారన్నారు.

# ఉమ్మడి ఎపిలో ఉన్న దుర్భిక్షం

(మొదటి పేజీ తరువాయి)



సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ పాలనలో వ్యవసాయం స్వర్ణ యుగంలా ఉండేదన్నారు. జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని జగదీశ్‌రెడ్డి అన్నారు. బోనస్ అంశం బోగస్ అయిందన్నారు. బోనస్ ఇవ్వకుండా ప్రభుత్వం మొండి చేయి చూపిందని విమర్శించారు. నల్లగొండ బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2017 నాటికి నల్లగొండ జిల్లా 40 లక్షల టన్నుల ధాన్యాన్ని అందించినట్లు చెప్పారు. వ్యవసాయం పండుగలా మార్చినట్లు-, అప్పుడు నిత్యం సమీక్షలు పెడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండి అన్నదాతలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని సమకూర్చినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ వచ్చిన తర్వాత జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా సమీక్షలు లేవు, ఒరిగింది శూన్యం అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలకులు అన్ని రంగాల్లో విఫలమైనట్లు తెలిపారు. రైతులు అన్ని విషయాల్లో మోసపోయినట్లు- చెప్పారు. ఇప్పటివరకు 30 శాతం కూడా రుణమాఫీ జరుగలేదు. రైతు భరోసా లేదు. ధాన్యం కొనుగోళ్లు లేవు. బోనస్ లేదు. మొత్తంమీద రైతులు అప్పుల పాలైనట్లు చెప్పారు. మంత్రులు కమీషన్లు తింటూ దళారులకు అమ్ముడు పోయినట్లు- దుయ్యబట్టారు. జిల్లాలో ధాన్యానికి మద్దతు ధర రావడం లేదని, తమ పాలనలో మిల్లర్ల వద్ద ఉండి పర్యవేక్షణ చేస్తూ మద్దతు ధర అందించినట్లు- వెల్లడించారు. ఇప్పుడు మిల్లర్లు, దళారుల వద్ద కమీషన్లు తింటూ మంత్రులు రైతులను నట్టేట ముంచుతున్నట్లు తెలిపారు. నల్లగొండలో ఓ మంత్రికి సోయి లేదని, ఎప్పుడు మైకంలో ఉంటాడని, రైతులంటే లెక్కేలేదని, కమిషన్ల దందాలో నిమగ్నమైనట్లు- తెలిపారు. ఎవ్వరు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టి భయపెడుతున్నారని, తాము కేసులకు భయపడే వాళ్లం కాదన్నారు. ప్రజా సమస్యలు పట్టించు కోకుండా గాల్లో హెలికాప్టర్లలో తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు కూడా కాంగ్రెస్ కార్యకర్తల్లాగా మాట్లాడుతున్నారని, జిల్లా కలెక్టర్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అంతేగానీ కాంగ్రెస్ కార్యకర్తలాగా మాట్లాడొద్దని హితవు పలికారు. పోలీసులు కూడా అతి చేయొద్దని, చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడితే ఊరుకోమని హెచ్చరించారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు.

# తెలంగాణలో మెరుగైన విద్యావ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)



విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని.. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్రాథమిక

విద్య స్థాయిలో ఎలాంటి సంస్కరణలు అవసరమన్న అంశంపై చర్చించారు. జీవన ప్రమాణాలు పెంచే విధంగా విద్యావిధానం ఉండాలని అధికారులకు సూచించారు. భాషతోపాటు-, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరిగేలా ఈ పాలసీ ఉండాలన్నారు. ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం ఎంత ఖర్చయినా కాంగ్రెస్ ప్రభుత్వం వెనకాడబోదన్నారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సీఎం సూచించారు. వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా

వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలోని తీసుకువచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె.జ్యోత్స్న శివారెడ్డి, పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ పలు కీలక సూచనలు చేశారు. విద్యా వ్యవస్థలో 1960 నుంచి చోటు- చేసుకున్న మార్పులు ఏవిధంగా నష్టం కలిగించాయో వివరించారు. బోధన ప్రమాణాలు ఏవిధంగా ఉండాలన్న దానిపై పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు- సీనియర్ నేత కె.కేశవరావు కూడా కొన్ని సూచలను చేశారు. వీటన్నింటినీ క్రోడీకరిస్తూ ఆచరణయోగ్యమైన పాలసీని తయారు చేయాలని సీఎం విద్యాశాఖను ఆదేశించారు.

# అధికారం కోసం అడ్డదారులొద్దు

(మొదటి పేజీ తరువాయి)

'బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతోపాటు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌ను సంప్రదిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అడ్డదారిలో ఎన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి అధికారంలోకి వచ్చారో చాట్ జీపీటీ, గూగుల్‌లో వెతికినా తెలుస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైంది. కొందరు అవగాహన రాహిత్యంతో బీజేపీ మెరుగవుతుందని అనుకుంటున్నారు. కానీ ఆ పార్టీ క్రమంగా బలహీనమవుతోంది. అబద్ధాలను ప్రచారం చేసి ఎక్కువ కాలం అధికారంలో కొనసాగుతానని బీజేపీ భ్రమపడింది. వాపును చూసి బలుపు అనుకున్న బీజేపీ అసలు స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు'అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ప్రతిష్టాత్మకంగా జన సమీకరణ ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బహిరంగ సభకు దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుంటూ జన సమీకరణపై దృష్టి పెట్టాలని పార్టీ నేతలను కేసీఆర్ ఆదేశించారు.

# అమెరికా నుంచి 682 మంది వెనక్కి రాక

నాటి నుంచి ఇప్పటి వరకు 682 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం భారత విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంట్‌లో వెల్లడించారు. ట్రంప్ ఇప్పటికే అనేక దేశాలకు చెందిన అక్రమ వలసదారుల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేకుండా అక్రమంగా తమ దేశంలోకి వచ్చిన, నివసిస్తోన్న వారిని స్వదేశాలకు పంపిస్తున్నారు. అలా జనవరి నుంచి ఇప్పటి వరకుమనదేశానికి చెందిన వారు 682 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. బహిష్కరణకు గురైన వారిలో చాలామంది చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన వారే కావడం గమనార్హం. వారిని అమెరికా సరిహద్దులోనే అరెస్టు చేసి, వెరిఫికేషన్ తర్వాత భారత్‌కు తిరిగి పంపారు. అయితే దీనివల్ల అక్కడ నుంచి వచ్చే రెమిటెన్స్ పైఎలాంటి ప్రభావం ఉండదని మంత్రి వెల్లడించారు. అక్రమ వలసలకు కారణమవుతోన్న ఏజెంట్లు, మానవ అక్రమ రవాణా సిండికేట్లపై దర్యాప్తులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. డంకీ మార్గాల ద్వారా ఈ వలసలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో అంతర్జాతీయ సరిహద్దులు దాటించుకుంటూ చట్టవిరుద్ధంగా ఏజెంట్లు ఓ దేశంలోకి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# టారిఫ్‌లతో పడిపోయిన ట్రంప్ గ్రాఫ్

(మొదటి పేజీ తరువాయి)



అమెరికన్ల సంఖ్య 43 శాతానికి పడిపోయింది. బుధవారంతో ముగిసిన మూడు రోజుల సర్వేలో ఈ మేరకు వెల్లడైంది. మూడు నెలల కింద అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయనకు మద్దతు ఇంత తగ్గడం ఇదే తొలిసారి. జనవరిలో పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకు ట్రంప్‌కు 47 శాతం మద్దతు లభించింది. ట్రంప్ సుంకాలు, నిర్వహణపై అమెరికన్లు బాగా అసంతృప్తితో ఉన్నారు. ఆయన విదేశాంగ విధానాన్ని సైతం వ్యతిరేకిస్తున్నారు. వలసదారులను తిప్పి పంపుతున్న అంశంపై మాత్రమే ట్రంప్ విధానాలకు ఆమోదం తెలిపారు. ట్రంప్ పాపులారిటీ తగ్గడానికి ప్రధాన కారణం ఆర్థిక వ్యవస్థను నిర్వహిస్తున్న తీరే. ఈ విషయంలో ఆయన పనితీరును కేవలం 37 శాతం మంది మాత్రమే ఆమోదించారు. ఆటోమొబైల్స్, ఆటోమోటివ్ విడిభాగాల వంటి వస్తువులపై ట్రంప్ విధించిన భారీ సుంకాలతో చాలామంది అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. కొత్త టారిఫ్‌లు తమకు, తమ కుటుంబాలకు చేటు చేస్తాయని భావిస్తున్నట్లు సర్వేలో దాదాపు సగం మంది పేర్కొన్నారు. ట్రంప్ సుంకాల పెంపు స్టాక్ మార్కెట్లో కూడా అనిశ్చితికి దారితీయడం తెలిసిందే. ఆయన దుందుడుకు విధానాలు దీర్ఘకాలిక దౌత్య నిబంధనలకు విఘాతం కలిగించడమే గాక ప్రపంచంతో అమెరికా వ్యవహరించే విధానంలో మార్పుకు కారణమయ్యాయి. ట్రంప్ సైనిక నిర్వహణ పట్ల కూడా అమెరికన్లు బాగా ఆందోళన చెందుతున్నట్టు సర్వే తేల్చింది. యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులపై సైనిక దాడి ప్రణాళిక సిగ్నల్ యాప్ ద్వారా లీకవడంపై వారు ఆగ్రహంగా ఉన్నారు. ఇది తవ్ర బాధ్యతారాహిత్యమని ఏకంగా 74 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇక ట్రంప్ విదేశాంగ విధానానికి జనామోదం కూడా జనవరిలో 34 శాతానికి పడిపోయింది. జనవరిలో ఇది 37 శాతంగా ఉంది. ట్రంప్ వలస విధానాలకు 48 శాతం ఆమోదం లభించింది.

# బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ కడియం

**ఎమ్మెల్యే పల్లా అక్రమంగా ఆస్తులు సంపాదించారని విమర్శలు**



జనగామ, (క్రైమ్ మిర్రర్): బిఆర్ఎస్ నేతలపై మాజీయమమంత్రి కాంగ్రెస్ నేత వరుస విమర్శలు మొదలు పెట్టారు. ఇప్పటికే కెసిఆర్ కుటుంబంపై విరుచుకుపడ్డ కడియం తాజాగా ఎమ్మెల్యేల పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యలపై మండిపడ్డారు. జిల్లాలోని చిల్పూర్ మండలం, చిన్న పెండ్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యలు చౌకబారు విమర్శలు మానుకోవాలి. ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. మాటల్లో అహంకారం, బలుపు తగ్గించుకోవాలని ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తిన కడియం శ్రీహరి, కేసీఆర్ వెంటే తిరిగి బీఆర్ఎస్ పార్టీని భ్రష్టు పట్టించావు. అధికారాన్ని, కేసీఆర్‌ను అడ్డంపెట్టుకుని ఆస్తులు కూడబెట్టుకున్నావు. అవినీతి, అక్రమాలతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ వ్యక్తివి నువ్వు. నీకు నా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా గెలిచావో అందరికీ తెలుసు. నీలాంటి వెధవల వల్లే కేసీఆర్ పరిపాలన పక్కదారి పట్టింది. ప్రజలు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పారని కడియం శ్రీహరి ఘాటుగా వ్యాఖ్యానించారు. తాను ఉమ్మడి వరంగల్ జిల్లా , స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధికి చేసిన కృషిని ప్రస్తావిస్తూ, నేను అభివృద్ధి కోసం పని చేశాను. ఎవరికైనా అభివృద్ధిపై చర్చ చేయాలనుకుంటే సిద్ధం అంటూ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలతో జనగామ జిల్లా రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# రేషన్ కార్డుదారులకు కేంద్రం శుభవార్త

## ఇకెవైసి గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): రేషన్ కార్డుదారులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డుదారుల కోసం ఇకెవైసి ఈ ప్రక్రియ గడువును మళ్లీ పొడిగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు దీనిని పొడిగించినట్లు- ప్రకటించింది. అసలు అయితే మార్చి 31వ తేదీ వరకు ఈ గడువు విధించిన సంగతి తెలిసిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం (కఎ÷ూఅ) కింద లబ్ధిదారులకు సబ్సిడీ పంపిణీలో పారదర్శకతను నిర్ధారించడం..అలాగే అర్హత లేని వ్యక్తుల దుర్వినియోగాన్ని నివారించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పొడిగింపు వల్ల ఇప్పటి వరకు ı-ఔ్‌ఈ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ఏప్రిల్ 30 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చునని సూచించింది. అధికారులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఎందుకంటే మరోసారి గడువు పొడిగించే అవకాశం ఉండక పోవచ్చని వివరిస్తున్నారు. ı-ఔ్‌ఈ పూర్తి చేయని వారి రేషన్ కార్డులు రద్దు కావచ్చునని స్పష్టం చేస్తుంది. దీని వల్ల ఉచిత రేషన్ సౌకర్యం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా ప్రచారం నిర్వహిస్తోంది. ıఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయడానికి రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లను సంప్రదించవచ్చునని కేంద్రం స్పష్టమైన వివరణ ఇచ్చింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అందుకు గడువు సైతం విధించింది. ఈ గడువు పూర్తయిన వెంటనే.. ప్రభుత్వ సిబ్బంది విచారణ చేపట్టి.. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజురు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు- ఒక్క రేషన్ కార్డు సైతం మంజూరు



చేయలేదంటూ ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం విదితమే.



# సన్నబియ్యం పథకానికి అనూహ్య స్పందన:ఉత్తమ్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. పేదలను ఆదుకునేలా దీనిని ప్రవేశ పెట్టామని అన్నారు. ఏరాష్ట్రం కూడా ఇలాంటి నినర్ణయం తీసుకోలేదన్నారు. ఈ పథకానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. దాదాపు 80 శాతం మంది పేదలు లబ్ధి పొందనున్నట్లు- తెలిపారు. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సన్నబియ్యం పంపిణీపై సమీక్షించారు. లబ్ధిదారుల ఇళ్లల్లో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలన్నారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలో ఓ లబ్ధిదారుడి ఇంట్లో సీఎం భోజనం చేయనున్నట్లు- తెలిపారు. పంపిణీలో అవకతవకలకు ఆస్కారం ఉండొద్దని, తేడా జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులంతా రేషన్ దుకాణాలను సందర్శించాలని కోరారు.

# సీతమ్మకు సిరిసిల్ల బంగారు చీర

సిరిసిల్ల,(క్రైమ్ మిర్రర్): శ్రీరామ నవమి సందర్భంగా సిరిసిల్లకు చెందిన నేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్ ప్రత్యేకంగా పట్టు వస్త్రాలను సిద్ధం చేశారు. వీటిని భద్రాద్రి రామయ్యకు సమర్పించరున్నారు. శ్రీరామనవమి కోసం ఏటా ఇలా చీరను నేస్తున్నట్లు వెల్లడించారు. పది రోజుల పాటు శ్రమించి నేసిన ఈ పట్టు చీర కొంగుపై భద్రాద్రి ఆలయ మూల విరాట్‌ను నేశారు. శంఖు, చక్ర నామాలు, హనుమంతుడు, గరుత్మంతుడును చీర బోర్డర్‌పై చూడొచ్చు. 'శ్రీరామ రామ రామేతి'.. శ్లోకం చీరపై 51 సార్లు కనిపిస్తుంది. వన్ గ్రామ్ గోల్డ్ జరీ పట్టు-తో రూపొందించిన ఈ ఏడు గజాల చీర బరువు దాదాపు 800 గ్రాములు. ఏటా సీతారాముల కల్యాణానికి పట్టు- వస్త్రాలు నేసే అవకాశం సిరిసిల్ల నేతన్నలకు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుకుంటున్నాని హరిప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

# సాగునీటిపై అధికారులతో హరీష్ రావు సమీక్ష

**యాసింగి సాగుకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచన**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఈసారి యాసంగి పంటకు సాగునీటి ఇబ్బందులు తలెత్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అధికారుల సమన్వయంతో తాత్కాలిక కాల్వ ఏర్పాటు చేయడం వల్ల కొంత ఇబ్బందులు తొలిగాయని పేర్కొన్నారు. వచ్చే యాసంగి పంట వరకు శాశ్వతంగా కాలువను ఏర్పాటు- చేయాలని.. అందుకు తగిన ప్రణాళిక చేపట్టాలని సూచించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో హరీశ్‌రావు శుక్రవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని సాగు నీటి సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈసారి 50 వేల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు. ఆయకట్టు పెరిగిన దృష్ట్యా -7,-8,- 9 కాలువలను త్వరితగతిన పూర్తి చేయాలని, రంగనాయకసాగర్ - మల్లన్న సాగర్‌ను అనుసంధానం చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పెండింగ్ పనులు, పెండింగ్ కాల్వలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులను వేగవంతం చేయాలన్నారు. చందలాపూర్ లిఫ్ట్ పనులు, కస్తూరిపల్లి, గోపులాపూర్ చెక్‌డ్యామ్ పనులు ప్రారంభం చేయాలన్నారు. పెండింగ్ పనులను పూర్తిచేసిన ఘన్‌పూర్ పంప్‌హౌజ్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు.

# శాంతిభద్రత పరిరక్షణలో రేవంత్ ప్రభుత్వం విఫలం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): శాంతి భద్రతలు కాపాడటంలో రేవంత్ సర్కార్ ఘోర వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. గత వారం రోజుల్లోనే నలుగురు మహిళలపై అత్యాచార ఘటనలు జరిగాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. మేడ్చల్ ఎంఎంటీఎస్ మహిళా బోగిలో ఉన్నప్పటికీ మహిళపై అత్యాచారం జరిగింది. సంగారెడ్డి కందిలో భర్తను కట్టేసి మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ గుడి దగ్గర మహిళపై సామూహిక అత్యాచారం జరిగింది. మార్చి 31న జర్మనీ మహిళపై పహాడీ షరీఫ్‌లో అత్యాచారం జరిగింది అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే హోం మంత్రిగా ఉన్నా ఇన్ని అత్యాచారాలు జరగడం ఏందీ? ఘోరమైన ఘటనలు జరుగుతున్నా రేవంత్ రెడ్డి వాటిపై కనీసం సమీక్షలు ఎందుకు పెట్టలేదు? రాష్ట్రంలో ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరుగుతుంటే, క్రైమ్ రేట్ పెరుగుతుంటే పోలీసులు మాత్రం తెలంగాణ భవన్ (బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం) చుట్టూ తిరుగుతున్నరు. బీఆర్ఎస్ నాయకులు, సోషల్ మీడియా సైనికులపై అక్రమ కేసులు పెట్టే పనిలో బిజీగా ఉన్నారు. నిన్న ఒక్కరోజే బీఆర్ఎస్ సోషల్ మీడియాపైన తెలంగాణ పోలీసులు 16 కేసులు నమోదు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ఎస్ఎల్‌బీసీ వద్ద కొనసాగుతున్న సహాయ చర్యలు

నాగర్ కర్నూల్,(క్రైమ్ మిర్రర్): జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ వద్ద సొరంగంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు గురువారంతో పూర్తవడంతో శుక్రవారం నుంచి మట్టి తొలగింపు పనులను ముమ్మరం చేశారు. సొరంగం నుంచి ఉబికి వస్తున్న ఊట నీటిని తోడిపోస్తూ స్టీల్, వ్యర్థాలను బయటకు తరలిస్తున్నారు. శుక్రవారం టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష నిర్వహించారు. సహాయక బృందాలు తమకు కేటాయించిన పనిని పూర్తి స్థాయిలో చేపడుతూ వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. టన్నెల్ లోపల అత్యధికంగా పేరుకుపోయిన స్టీలును లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల 24 గంటల పాటు 5 ఎస్కావేటర్లు స్టీలు భాగాలను, ప్రమాద ప్రదేశంలో భారీగా ఉన్న రాళ్లను లోకో ట్రైన్ ప్లాట్ ఫామ్ పైకి తరలిస్తూ, మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. 100 మీటర్ల వరకు పునరుద్ధరించిన కన్వేయర్ బెల్టు ద్వారా మట్టి , బురదను బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. . టన్నెల్ లోపల ఉన్న ఊట నీటిని నిరంతరం బయటకు పంపింగ్ చేస్తున్నట్లు తెలియ జేశారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులను కల్పిస్తూ, ఆహారం, ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వివరించారు. సమీక్షలో ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాసులు, జీఎస్ఐ అధికారులు రాజ్ కుమార్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి శోభాయాత్రకు భారీ బందోబస్తు

## ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నగర పోలీసులు

## సమన్వయ సమావేశంలో సిపి వెల్లడి

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): నగరంలో నిర్వహించే శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలతో పాటు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నగరంలో నిర్వహించే శోభాయాత్రకు దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, శోభాయాత్రను శాంతియుతంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నగర సీపీ సీవీ ఆనంద్ సూచించారు. శ్రీరామనవమి శోభా యాత్ర సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో సీతారాంబాగ్‌లోని ద్రౌపది గార్డెన్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ సీవీ ఆనంద్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 20 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. యాత్రలో షీటీమ్స్, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్రను డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు కొనసాగుతున్న శ్రీరామ నవమి శోభా యాత్రలో విగ్రహాల ఎత్తు గురించి జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. యాత్రను మధ్యాహ్నం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా ట్రయల్ రన్ చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. నిర్వాహకులు డ్రోన్లను వినియోగించేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. పెద్ద శబ్దాలతో డీజే వినియోగించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు



తలెత్తుతున్న దృష్ట్యా, సౌండ్ సిస్టం వినియోగించుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. శోభా యాత్ర ప్రశాంతంగా ముగిసేలా వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ.. శోభా యాత్రలో ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల మరమ్మతు, లైటింగ్, వసతులు ఏర్పాటు- చేస్తున్నామని తెలిపారు. మంగళ్‌హాట్ నుంచి పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, సిద్ది అంబర్ బజార్, అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, కోఠి, ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా మీదుగా హనుమాన్ వ్యాయామశాల వరకు ఓపెన్ టాప్ జీప్‌లో ప్రయాణిస్తూ రూట్‌ను పరిశీలించారు. ఈసమన్వయ సమావేశంలో అడిషనల్ సీపీ విక్రం సింగ్ మాన్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీలు, భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు, ఆర్ అండ్ బీ, విద్యుత్, అగ్నిమాపక శాఖ, ఆర్టీసీ, జలమండలి, ఆర్‌టీఏ, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జింకలపై కుక్కల దాడి ఎంతో కలిచివేసింది

**గతంలో ఇలాంటి ఘటనలు చూశామా..? : కేటీఆర్**



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కుక్కల దాడిలో ఓ జింక ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఎంతోగానో కలిసివేసిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదివరకు ఇలాంటి ఘటనలు ఎప్పుడైనా హెచ్‌సీయూలో చూశామా అని కాంగ్రెస్‌ను ఆయన నిలదీశారు. ఈ రక్తపు మరకలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతికే అంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. అత్యాశతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం జింకలకు నెలవైన కంచ గచ్చిబౌలి భూములను ధ్వంసం చేసింది. దీంతో ఆ ప్రాంతంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ జింకను చంపాయి. కంచ గచ్చిబౌలి మినీ ఫారెస్ట్‌ను రేవంత్ రెడ్డి బుద్ధిహీనంగా ధ్వంసం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతుజాలం నష్టపోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. వన్యప్రాణుల ఈ దారుణ హత్యపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల్లో చెట్లను నరికివేయడంతో.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ హాస్టల్ వైపు జింక వచ్చింది. జింకను చూసిన కుక్కలు మొరుగుతూ.. దానిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను హెచ్‌సీయూ విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది.. వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. జింకకు తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో అది చనిపోయింది. ఇక చాలా జింకలు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఆ జింకలను జనాలు చేరదీసి.. వాటికి నీళ్లను అందిస్తున్నారు. మూడు రోజుల్లో 100 ఎకరాల్లో పచ్చని చెట్లను నరికివేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై జనాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే విధంగా రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల వద్ద చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలుగురాష్ట్రాలో నిన్న వర్షం బీభత్సం సృష్టించింది. ఇటు తెలంగాణ, అటు ఏపీలో వడగండ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వడండ్ల వాన దాటికి పలు ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికను అందించాలని అగ్రికల్చర్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం రాసులపై కప్పేందుకు కవర్లు లేక.. పలు ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిచినట్టు తమ దృష్టికి వచ్చిందని మంత్రి అన్నారు. మార్కెట్‌లోకి వచ్చిన ధాన్యాం తడవకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడూ గోడౌన్‌లలోకి తరలించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లోనూ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో వర్షాల పట్లా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడూ పరిస్థితులను పరిశీలిస్తూ రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

శనివారం

5-4-2025

## ఎడిటోరియల్



# పంతం నెగ్గించుకున్న ఎన్డీయే

ఎవరు ఎంతగా వ్యతిరేకించినా వక్ఫ్ సవరణ బిల్లు చట్టంగా మారబోతోంది. అంతా సవ్యంగా ఉన్నప్పుడు ఎవరైనా స్వోత్కర్షలకు పోవచ్చు. కానీ క్లిష్ట సమయాలే ఎవరేమిటన్నది నిగ్గుదేలుస్తాయి.ఇప్పుడు వక్ఫ్ బిల్లుపై సునాయాసంగా తన పంతం నెగ్గించు కోవటం ఎలా సాధ్యమైందో అందరికీ తేటతెల్లమైంది. వీరితోపాటు మొదట వీరావేశంతో మాట్లాడిన ఒడిశాకు చెందిన బీజేడీ ఆఖరి నిమిషంలో స్వరం మార్చి పార్టీ ఎంపీలకు స్వేచ్ఛనిస్తున్నట్టు ప్రకటించటం ప్రభుత్వానికి కలిసొచ్చింది. నిరుడు ఆగస్టులో ఈ బిల్లు ప్రవేశపెట్టి ఆదరా బాదరాగా ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం తహతహలాడినా విపక్షాలు తీవ్రంగా ప్రతిఘటించటంతో దీన్ని సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) పరిశీలనకు పంపక తప్పలేదు. ఎన్డీయే సర్కారు ఏర్పాటైన పదేళ్లలో ఒక బిల్లు జేపీసీకి వెళ్లటం అదే ప్రథమం. రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెరిగిన బలం వల్లనైతేనేమి, ఏపీకి చెందిన కొందరు దిగజారుడు ఎంపీలతో రాజీనామాలు చేయించటం వల్లనైతేనేమి అప్పటితో పోలిస్తే ఇప్పుడు రాజ్యసభలో ఎన్డీయే బలం పెరిగింది. అందుకే వక్ఫ్ బిల్లు సునాయాసంగా గట్టెక్కుతుందని అధికారపక్షం నిర్ణయానికొచ్చింది. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి సమస్యలు లేవని ఎవరూ అనరు. ఎన్నడో 1954లో వచ్చిన తొలి వక్ఫ్ చట్టం అవసరాలకు అనుగుణంగా లేదన్న ఉద్దేశంతో 1995లో దాని స్థానంలో మరో చట్టం తీసుకొచ్చారు. 2013లో సవరణలు చేశారు. అయినా మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం వున్నదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. వక్ఫ్‌కు సంబంధించిన ఆస్తుల్లో దాదాపు సగంవరకూ వాటి యాజమాన్యం లేదా నిర్వహణకు సంబంధించి సమస్యలున్నాయి. అవినీతి ఉన్నదనీ, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనీ ఆరోపణలు రావటం కూడా వాస్తవం.

పారదర్శకత పాటించటంలేదన్న విమర్శ కూడా ఉంది. వీటిని సరిదిద్దాలంటే ముస్లిం పండితులతో, నిపుణులతో, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వంటి సంస్థలతో మాట్లాడాలి. ఎలావుంటే బాగుంటుందన్న అంశంలో సూచనలూ, సలహాలూ తీసుకోవాలి. కానీ ఇవేమీ చేయకుండా బిల్లు తీసుకురావటంతో ముస్లిం వర్గాల్లో సంశయాలకు అవకాశం ఏర్పడింది. ముస్లింల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లు తీసుకొచ్చినట్టు ప్రభుత్వం చెప్పటం బాగానేవున్నా ఆచరణ అందుకు విరుద్ధంగా ఉంది.

బుజ్జగింపు ధోరణితో, ఓటుబ్యాంకు రాజకీయాలపై దృష్టితోనే బిల్లును వ్యతిరేకిస్తున్నారని విపక్షాలపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం తాను చేసిందేమిటో ఆలోచించిందా? నిజంగా చిత్తశుద్ధి వుంటే బిల్లు రూపకల్పనకు ముందు ఆ వర్గాలతో చర్చించటానికి అభ్యంతరమేమిటి? ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డులు, కౌన్సిళ్లలో స్థానం ఎందుకు కల్పించారన్న విషయమై ప్రభుత్వం ఇచ్చిన సంజాయిషీ ఏమాత్రం సంతృప్తికరంగా లేదు.

మసీదుల నిర్వహణ లేదా మతపరమైన ఇతర అంశాలకు సంబంధించి వక్ఫ్ కౌన్సిళ్లు జోక్యం చేసుకోబోవని, కేవలం వక్ఫ్ ఆస్తుల వ్యవహారాలనే చూస్తాయని కేంద్రమంత్రులు అమిత్ షా, కిరణ్ రిజుజు చెబుతున్నారు. కానీ మౌలికంగా వక్ఫ్ ఆస్తి అంటే సంపన్న ముస్లింలు భక్తిభావనతో మతపరమైన అవసరాల కోసం, ఆ వర్గాల అభ్యునఅటువంటప్పుడు ఆ ఆస్తుల నిర్వహణలో అన్యులకు చోటీయటం అసమంజసం కాదా? ఇతర మతాలకు సంబంధించిన ధార్మిక ఆస్తుల నిర్వహణలో కూడా ముస్లింలకు అవకాశం ఇస్తారా? ఒకవేళ అలా ఇచ్చినా అందుకు ఆ మతస్తులు అంగీకరిస్తారా? ఇంతకాలం ముస్లిమేతరులు సైతం తమ ఆస్తిని కారుణ్య భావనతో వక్ఫ్‌కు ఇవ్వొచ్చన్న నిబంధన ఉండేది.

కానీ తాజా సవరణ ప్రకారం అయిదేళ్లపాటు ఇస్లామ్‌ను ఆచరిస్తేనే అందుకు అర్హత వస్తుంది. అయితే ఇస్లామ్ ఆచరణే మిటో బిల్లు వివరించలేదు. 2013లో ఆ మరుసటి సంవత్సరం జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ఆదరా బాదరాగా వక్ఫ్ చట్టానికి అప్పటి యూపీఏ ప్రభుత్వం సవరణలు తెచ్చిందని, అందువల్ల ఒక్క ఢిల్లీలోనే అనేక ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా మారాయని ప్రభుత్వం చెబుతున్నది. కానీ ఆ సవరణలను నాటి బీజేపీ నేతలు ఎల్‌కే అద్వాణీ, సుష్మాస్వరాజ్ సమర్థించారు. సవరణలు పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించటంలో తోడ్పడ్డారు.

వక్ఫ్ బిల్లు తీసుకొచ్చిన ఉద్దేశంపై దేశవ్యాప్తంగావున్న 20 కోట్లమంది ముస్లింలలో ఎన్నో సంశయాలున్నాయి. బిల్లులోని నిబంధనలు ఆ సంశయాలను మరింత పెంచేవిగా ఉన్నాయి. వక్ఫ్ ఆస్తుల్ని ఆర్నెల్లలోపు డేటా బేస్‌లో నమోదు చేయనిపక్షంలో వాటికి సంబంధించిన వివాదాలపై న్యాయస్థానాల మెట్లెక్కటం అసాధ్యమని బిల్లు చెప్పటం సమంజసంగా అనిపించదు.

వివాదంలో పడిన వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ ఉన్నతాధికారి నిర్ణయం అంతిమం కావటం కూడా సమస్యాత్మకం. ఏ ఉన్నతాధికారైనా ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకోవటం సాధ్యమేనా? ఇది అనుమానాలు రేకెత్తించే అవకాశం లేదా? మొత్తానికి తెలుగుదేశం వంటి పక్షాలు బిల్లుకు ఓటేసి, ఆపైన సవరణలు తీసుకొచ్చామంటూ లీకులిస్తూ, తమ సవరణలతో బిల్లు పకడ్బందీగా వచ్చింద నడం హాస్యాస్పదం. అందులోని డొల్లతనం ఏమిటో ఈ నిబంధనలే చెబుతున్నాయి. క్లిష్ట సమయాల్లో తటస్థత వహించటం ద్రోహంతో సమానం. తటస్థత మాట అటుంచి నిస్సంకోచంగా బిల్లును సమర్థించి టీడీపీ తన నైజాన్ని బయట పెట్టుకుంది. ఇందుకు మూల్యం చెల్లించక తప్పదు.



# హద్దుల్లో ఉంటూ..పాలన సాగించాలి!

ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి పోయింది. ఎవరు అధికారంలో ఉన్నా తమకు అనుకూలమైన పనులు నెరవేర్చుకోవడంలో బిజీగా ఉన్నారు. అన్నీ రాజకీయాల చుట్టే తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఏం తీర్పు రాబోతోందో అన్నది సర్వత్రా ఉత్కంఠగా ఉంది. గతంలో ఉన్నట్లుగానే చట్టాలు ఉన్నాయని, కొత్తగా ఉప ఎన్నికలు రావడానికి అవకాశం లేదని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వ్యాఖ్యలు చేశారు. దీనిపైనా సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సిఎంకు నియంత్రణ లేదా అని ప్రశ్నించింది. అంటే నేతలు ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు. ఇకపోతే బిసి రిజర్వేషన్లపై ఢిల్లీ వేదికగా మొత్తం ప్రభుత్వమే తరలి వెళ్లి ధర్నా చేసింది. సిఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ పరివారం వెళ్లింది. నిజానికి ఇదంతా ఓ పద్ధతి ప్రకారం జరగాల్సిన వ్యవహారం. రాజ్యాంగ విలువలు, నిబంధనలతో కూడుకున్న విషయం. దీనిపై తేల్చండి అంటూ..ఢిల్లీకి వెళ్లారు. ధర్మయుద్ధం అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. కాంగ్రెస్ తాను ఇచ్చిన,ఇస్తున్న హామీలకు కేంద్రాన్ని బాధ్యులుగా చేసి విమర్శలు చేయడం సరికాదు. ఇకపోతే హైదరాబాద్‌కు ధీటుగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రకటించారు. అక్కడ పరిశ్రమలు, ఐటి సంస్థలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరి కొత్తగా ఇప్పుడు వివాదంలోకి వచ్చిన 400 ఎకరాల్లో ఐటి పార్కులు అభివృద్ధి చేస్తామని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పడం దారుణం కాక మరోటి కాదు. ఓ వైపు ఆందోళనలు జరుగు తున్నా, సుప్రీం విచారణ చేస్తున్నా ఇలాంటి వ్యవహారాల్లో సంయమనం పాటించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. నిజానికి ఈ 400 ఎకరాలను అర్జంటుగా అమ్మి డబ్బులు చేసుకోవాలన్న ఆత్రుత పాలకుల్లో ఉంది. ఇకపోతే బిఆర్ఎస్ నేతలు గత పాపాలను వదిలి కొత్తగా కాంగ్రెస్ మాత్రమే పాపాలు చేస్తున్నదన్న రీతిలో తెగ రెచ్చిపోయి మాట్లాడుతున్నారు. దీంతో తమ పాపాల తాలూకు వాసనలు రాకుండా చూసుకోవాలన్న పనిలో పడ్డారు. అందుకే విపక్ష బిఆర్ఎస్ తాను చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. గతంలో చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయటపడడంతో ఎదురుదాడి మంత్రం ప్రయోగిస్తోంది. తామంతా సుద్దపూసలం అన్నట్లుగా కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులు పాడిందే పాటగా పాడుతున్నారు. ఓ వైపు దర్యాప్తు సంస్థలు ఒక్కో అవినీతి పుట్టను తవ్వి పెడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్, ప్రాజెక్టల కుంభకోణాలు,అవినీతి, ధరణి ఇలా ఒక్కటేమిటి అనేక రకాలుగా అవినీతి చెదను గుర్తించారు. వారి పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శలు వచ్చాయి. గతంలో కరెంట్, మంచినీళ్లు, సాగునీటి ఆందోళనలను పత్రికల్లో రాకుండా, సోషల్ మీడియాలో రాకుండా మేనేజ్ చేసిన ఘనులు వీరు. ఏదైనా వార్త వస్తే విలేకర్లపై కేసులు పెట్టారు.ఈ క్రమంలో గతంలో, ఇప్పుడు అందరినీ కలుపుకుని అవినీతికి పాల్పడ్డ చెదపురుగులను ఏరిపారేయాల్సిందే. అలాగే రాజకీయంగా వారిని ఎండగట్టాల్సిందే. ప్రజలు నేరుగా బాధితులు కనుక ..ఈ విషయంలో ప్రజలే తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ.. ముందుకు సాగాలి. ప్రజాప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి అసలుసిసలు కృషి చేయాలి. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చుకోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. ఉచిత పథకాలకు పాతరేయాలి. సన్న బియ్యం ఇస్తున్నామని చంకలు గుద్దుకోకుండా..అర్హులకు అదీ ధరలు పెంచి

ఇవ్వాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు కూడా నిజాలు గుర్తించి మసలుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛగా బాధ్యతలు నిర్వహించే అవకాశం ఉండదు. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప ముమ్మందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. బీఆర్ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా అన్నది పనుల్లో చూపాలి.

ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేకుండా నిరంకుశంగా పదేళ్లు పాలించారు. పదేళ్లలో ఏం చేశారో ఇప్పుడు చూస్తున్నాం. కరువు వచ్చిందంటే కాంగ్రెస్ తెచ్చిందని బుర్రలేని మాటలు మాట్లాడుతున్నారు. ఇది రైతులు కూడా అర్థం చేసుకోగలరు. సిఎం రేవంత్ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. బిఆర్ఎస్ అవినీతిని ఎండగట్టడమే పాలన కాదు. పనులు కూడా చేస్తూ పోవాలని గుర్తించాలి. ఎపిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగాన్ని గుర్తించాలి. చంద్రబాబు ప్రజల సంక్షేమం కోరి ముందుకు అడుగేస్తున్నారు. పెండింగ్ పనుల్లో వేగం పెంచారు. ఇచ్చినహామీలను అమలు చేస్తూనే ఇవ్వని అనేకానేక పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నాలు చేపట్టారు. సాగు,తాగునీటి రంగాలను చక్కదిద్దే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలకు పూనుకుంటున్నారు. ఈ క్రమంలో వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వలు పెంచడం, సాగునీటి రంగాన్ని ఆధునీక రించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

**సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు...రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయదానికి ప్రజలంతా సిద్ధం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు.**

# సంక్షేమం పేరుతో..దివాళా తీయిస్తే ఎలా!

వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిషంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిని కూడా లేకుండా చేస్తామనే దుర్మార్గపు ఆలోచన సరికాదు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. చ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవడం ద్వారా విలువైన భూములను కాపాడాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం తగదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్పగా రాణిస్తున్నారు. దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉంది. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం భూముల వేలం తగదని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి. భూములు ప్రభుత్వానివే అని చెబుతున్న సిఎం, మంత్రులు వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి. యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్న తీరు మంచిది

కాదు. బుల్డోజర్లను పెట్టి అక్కడున్న చెట్లను తొలగించి చదును చయడం సరికాదు. హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. ఇప్పటికే కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. హైదరాబాద్లఓ ఇప్పటికే కొండలు గుట్టలు మాయం అయ్యాయి. ఎక్కడపడితే అక్కడ ఇవి ధ్వంసం చేయడం సరికాదు. వీటిని కూడా ఆపాలి. ఇలాచేస్తూ పోతే భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి




ఏర్పడుతుంది. పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల ఎకరాలు మాయం అయ్యాయి. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి రాజకీయపార్టీలు కూడా సూచించాయి. పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం సరికాదని పాలకులు గుర్తించాలి. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం కూడా మంచిది కాదు. ముందుగా ఉచిత పథకాలను సమీక్షించాలి. నష్టాలను తెచ్చే పథకాల్లో కోతలు విధించుకోవాలి. అప్పులకు,భేషజాలకు పోకుండా ఉన్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపాలి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేయాలంటే అమ్మకాలు.. కాదు ఆస్తులు సృష్టించాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్ళడం సరికాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. హైదరాబాద్ లో కబ్జాలను గుర్తించి ముందుగా వాటిని విముక్తం చేయాలి. చెరువులు కబ్జాలను గుర్తించాలి. అందుకు మైడ్రా చేస్తున్న కృషిని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల కబ్జాలను గుర్తించి, ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. డబ్బులను వృధా చేసే ఓట్ల పథకాలకు పాతరేసినప్పుడే రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడగలదు.

# పన్నులు బారెడు సౌకర్యాలు మూరెడు

## వసుళ్లలో లక్ష్యం ఉంటుంది, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం ఉంటుంది

## స్థానిక సంస్థలకు నిధుల సమస్య "అవినీతితోనే"



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** వీలైనంత ఎక్కువగా ప్రజల నుండి పన్నులు రాబట్టడమే లక్ష్యంగా ప్రజలపై ఆస్తి పన్ను పేరిట మోయలేని భారం అధికారులు ప్రతిపాదిస్తే ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆమోదించారు. పెంచిన పన్నుల స్థాయిలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారా అంటే అది లేదు, ఆస్తి పన్నులపై వడ్డీ మాపి పథకం కొంత ఊరట ఇచ్చిన ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితులు ఉండవు కదా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీర్పేట్ కార్పొరేషన్ పరిధిలో భారీగా పెంచిన ఇంటి పన్నులతో కార్పొరేషన్ పరిధిలోని ప్రజలపై మోయలేని భారాన్ని మోపారు. ఇంటి పన్నులు వసూలే లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు అంతే లక్ష్యంగా అవినీతి లేకుండా అభివృద్ధి పనుల్లో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలోని భావన, 800రూపాయలు ఉన్న ఇంటి పన్నును అమాంతం 6000 రూపాయలకు పెంచితే పేద ప్రజల నడ్డి విరచడమే అవుతుంది, రకరకాల పన్నుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న అధికారులను ప్రజాప్రతినిధులను అభివృద్ధిపై ప్రశ్నిస్తే నిధుల కొరత ఉందని గత ఐదు ఏళ్ళుగా మీర్పేట్ కార్పొరేషన్ పరిధిలో చెప్పడం చూసాము, అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అవినితి లేకుండా వ్యవహరిస్తే అసలు స్థానిక సంస్థలకు నిధుల కొరతే ఉండదని అందరి అభిప్రాయము. పన్నుల కోసం పని కట్టుకొని క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారులు అంతే లక్ష్యంగా సమస్యలను తెలుసుకోవడానికి పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. కాంట్రాక్టు పనుల్లో భాగం కావాలనుకుంటారు కానీ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రచించడంలో మాత్రం భాగస్వాములు కావడం లేదు, కానంతవరకు స్థానిక సంస్థలకు నిధుల సమస్య ఉంటుంది దీని వలన ప్రజలపై మోయలేని భారాలు కొనసాగుతూనే ఉంటాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధిక పన్నుల పెంపుపై కార్పొరేషన్ పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం దాటిన పెంచిన పన్నుల విషయం పట్టించుకోకపోవడం ఇక్కడి ప్రజలకు నష్టదాయకమని చెప్పొచ్చు, గత ప్రభుత్వ హయాంలోనే ఇంటి పన్నుల పెంపు జరిగిందని, భారీగా పెంచిన ఇంటి పన్నుల విషయంలో కాంగ్రెస్ బీఆర్ఎస్పార్టీలే కారణంగా కనిపిస్తున్న తమ ఉనికి కోసమే ఆందోళనలు చేస్తున్నారని విషయం ప్రజలు గ్రహించకపోరు.



## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

**నూతనకల్(క్రైమ్ మిర్రర్) :** మండల పరిధిలోని దిర్శినపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాభృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనాటి కార్యక్రమంలో ఎస్ఐ మహేంద్ర నాథ్ మాట్లాడుతూ పోలీస్ ప్రజా భరోసా,రోడ్డు ప్రమాదాలపై,సైబర్ నేరాలపై,గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, ఆన్ లైన్ బెట్టింగ్, మూఢనమ్మకాల పైన పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు,బ్యాంక్ ఖాతా, ఏటిఎం కార్డ్ వివరాలు,ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగంగా ప్రయాణించవద్దు. వేధింపులపై100కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు సాంస్కృతిక, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు కానిస్టేబుల్ నవీన్ రెడ్డి, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య,గోపయ్య, గురులింగం, క్రిష్ణ, చారి,నాగార్జున,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేరుకేనా మర్రిగూడ మోడల్ స్కూల్..

## మోడల్ స్కూల్ అభివృద్ధి నిధులపై విచారణ జరపాలి



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** పిఎంసి నిధుల అవకతవకలు జరిగాయని,వెంటనే ఈ నిధులపై సమగ్ర విచారణ జరపాలని, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండు రంగారావు, మునుగోడు నియోజకవర్గ విద్యార్థి నాయకుడు సిలివేరు విష్ణు ప్రిన్సిపాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.. మర్రిగూడ మండల కేంద్రంలోని శుక్రవారం మోడల్ స్కూల్ ను వారు సందర్శించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా అభివృద్ధి కోసం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో, అనేక నిధులను వెచ్చించి కాలిగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ, తోడుపాటును అందిస్తుంటే, ఇక్కడ మాత్రం నిధులు సక్రమంగా ఖర్చు చేయకుండా, బ్యాంక్ ఖాతా సాకుతో గత ఏడాది నిధులను వెనుకకు మళ్లించారని ఆరోపించారు.. ఈ ఏడాది వచ్చిన నిధులను ఖర్చు చేయకుండా చోద్యం చూస్తున్న ప్రిన్సిపాల్ శివస్వరూప రాణిపై, విద్యాశాఖ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలలో తరగతి గధులకు కిటికీలు లేవని, విద్యార్థిని విద్యార్థులు టాయిలెట్ కి వెళ్లాలంటే, వెంటిలేషన్ లేకపోవడం, కోతుల భయంతో ఒకరికొకరు తోడు తీసుకపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేసారు.. కేర్ టేకర్ లేకపోవడంతో విద్యార్థినులకు ఏదైనా సమస్య జరిగితే, బయటకు వచ్చి ఇతరుల సహాయంతో ఆసుపత్రికి వెళ్లే దౌర్భాగ్య పరిస్థితి మర్రిగూడ మోడల్ స్కూల్ లో దాపురించిందన్నారు.. మోడల్ స్కూల్ ప్రారంభించినప్పటి నుండి ప్రిన్సిపల్ మారినా విద్యార్థుల తల రాతలు మారడం లేదని, దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రిన్సిపాల్ వైఫల్యామా..! లేక పర్యవేక్షించే విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమా..! అంటూ వారు ప్రశ్నించారు.. పాఠశాలలో వికలాంగులైన విద్యార్థిని విద్యార్థులు, ఉంటే వారిని ప్రోత్సాహిస్తూ అందరితో సమానంగా ఉండే విదంగా నిర్వహణ కార్యక్రమాలు శూన్యమని, మహిళా విద్యార్థినులను చైతన్య పరిచే కార్యక్రమాల ఉండవని, విద్యతో పాటు విద్యార్థిని విద్యార్థులకు వారి నైపుణ్యతను బట్టి నిర్వహించే క్రీడలు అంతత మాత్రమేనని, సాంస్కృతిక రంగం, డ్రాయింగ్ వంటివి ఇప్పటికి ప్రదర్శించిన దాకలాలు చూడలేదని, ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు తక్షణమే విచారణ చర్యలు చేపట్టి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మోడల్ స్కూల్ ను ఆదర్శ పాఠశాలని, చెప్పుకోవడానికే పరిమితం కాకుండా, విద్యార్థులకు విజ్ఞానం నింపి ఆదర్శంగా తీర్చి దిద్దాలని అధికారులను వారు ఈ సందర్భంగా కోరారు.. లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో కుక్కల మహేందర్, కర్నాటి శివ గౌడ్, రాము, విద్యార్థి నాయకులు తదితరులు ఉన్నారు..

## నిరు పేదల అండగా సీఎం సహాయ నిధి

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహాయ సహకారాలతో నాంపల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 23 మందికి సంబంధించిన మొత్తం 7 లక్షల 4 వేల రూపాయలను చెక్కుల రూపంలో లబ్ధిదారులకు శుక్రవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద కుటుంబాలకు కొంత వరకు ఆర్థికంగా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ గట్టు పల్లి నర్సిరెడ్డి మండల తహసిల్దార్ గుగులోతు దేవా సింగ్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, మాజీ జెడ్ పి టి సి ఎలుగోటి వెంకటేశ్వర రెడ్డి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకులు ఎరెడ్ల రఘు పతి రెడ్డి, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, గఫార్ విష్ణుమూర్తి, మాజీ సర్పంచులు ఎంపిటిసిలు తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్వింటాల పిడిఎస్ బియ్యం పట్టివేత

### నలుగురిపై కేసు నమోదు.. మాడుగులపల్లి ఎస్సై ఎస్. కృష్ణయ్య



**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, మాడుగులపల్లి:** అక్రమంగా 213 క్వింటాళ్ల (700 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ వివరాలను వెల్లడించారు... హుజూర్నగర్, పాలకీడు, నేరేడుచర్ల, దామరచర్ల మరియు మిర్యాలగూడ పరిసర ప్రాంతాల నుండి సేకరించిన 700 బస్తాలు సుమారుగా 213 క్వింటాల పిడిఎస్ బియ్యాన్ని (ఎంహెచ్ 14 ఈఎఫ్ 5592) నెంబర్ గల 12 టైర్ల లారీలో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం 4 గంటల 20 నిమిషాల సమయంలో మాడుగులపల్లి మండల కేంద్రంలోని టోల్గేట్ వద్ద టాస్క్ ఫోర్స్-1, సివిల్ సప్లై డిటి జావీద్, ఆర్ఐ సైదులు మరియు ఎస్సై మండల పోలీస్ సిబ్బంది తో కలిసి లారీని పట్టుబడి చేసినట్లు తెలిపారు. అనంతరం బియ్యం వ్యాపారి దివ్యల మౌనిష్, లారీ ఓనర్ సురేంద్ర శ్యామ్ రావు మూడే, లారీ డ్రైవర్ జిలాని ముస్తఫా షేక్ మరియు క్లీనర్ యువరాజు లక్ష్మణ్ ల పై సివిల్ సప్లై డిటి మరియు ఆర్ ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ ఎస్ పార్టీ ప్రత్యేక చొరవ

**సీతారం ధూళిపాళ గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** మణికొండ మున్సిపాలిటీలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. శుక్రవారం పార్టీ స్థానిక నాయకులు గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం లాలమ్మ గార్డెన్స్ పరిసర ప్రాంతాలలో సందర్శించారు. స్థానిక ప్రజలు సమస్యలను వివరించారు. ప్రధానంగా పెరిగిన ఇంటి పన్నుల సమస్య, దానిపై ప్రశ్నిస్తే అధికారుల ప్రతిస్పందన తీరు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణం చేపట్టినప్పుడు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, అందుకు భిన్నంగా ఏర్పరచిన కారణంగా, ఈ ప్రాంతంలో చిన్న స్థలంలో పెద్ద ఇండ్లు ఉన్న కారణంగా తరచూ డ్రైనేజీ సమస్య తలెత్తుతుందని వాపోయారు. ఈ ప్రాంతంలో మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వీరికి హైదరాబాద్ వాటర్ వర్క్స్ వారి ట్యాంకర్స్ సదుపాయం కూడా సరిగ్గా లేదని తెలిపారు. ఈ కారణంగా ప్రైవేట్ ట్యాంకర్ల మీద ఆధారపడుతున్నట్లు వివరించారు. వాహన దారులు ఇక్కడి పెద్ద రహదారిపై అతివేగంగా వెళుతున్న దరిమిలా సదరు రహదారిను దాటడానికి వయోజనులు పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కావున ఇక్కడ రహదారీపై జీబ్రా క్రాసింగ్ పెట్టడం ఎంతైనా అవసరం ఉందని స్థానికులు తెలిపారు. షేక్ పేట నుంచి పుప్పాలగూడ మీదగా వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్ వద్ద నిలుపుతున్నారు కానీ పుప్పాలగూడ మీదుగా షేక్పేట్ వెళ్లే బస్సులను ఆపడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పై విషయాలలో సంబంధిత అధికారులు స్పందించి స్థానికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్, అందే



లక్ష్మణ్ రావు, బుద్ధోలు బాబు, సంఘం శ్రీకాంత్, గోరుకంటి విఠల్, శ్రీనివాస్ చారి, దిలీప్, యాలాల కిరణ్, భాను చందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, తిరుపతి, బాలాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# చండూరు దళిత ఇండ్ల కూల్చి వేతపై పై కలెక్టర్ కి పిర్యాదు

- 20 ఏళ్ల నుండి ఎమ్మార్వో, ఆర్ఐ లు ఎందుకు చర్యలు తీసుకోదు
- పలు ప్రశ్నలు సంధించిన ఫిర్యాదు దారులు
- • రేవంత్ సర్కారు ఈ స్థలంలో ఏమైనా నిర్మిస్తున్నారా.?
- దళితులపై అంటరానితనం మరియు వివక్ష ఎందుకు
- ఎమ్మార్వో, ఆర్ఐ లకు బాధ్యత లేదా.? వీరి పై చర్యలు తీసుకోవాలి
- ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని విజ్ఞప్తి
- కూల్చివేసిన ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్







హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 04: చిలప్ చెడ్ మండలంలోని, చండూరులోని సర్వే నెంబర్ 2 లో దళిత ఇళ్ల కూల్చివేతపై విచారణ జరిపి నష్టపరిహారం ఇవ్వాలని చండూరు గ్రామస్తులు కలెక్టర్ కి పిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం, చండూరు గ్రామంలోని సర్వే నెంబర్ 2 లో, బొందల గడ్డ ప్రాంతంలో 15-20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దళితుల ఇళ్లను, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, గ్రామస్థులతో విచారణ జరపకుండా కూల్చివేశారని ఫిర్యాదు లొ తెలిపారు. 15-20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దళిత ఇళ్లను నోటీసులు లేకుండా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై అంటరానితనం మరియు వివక్ష చూపిస్తున్నారని అన్నారు. సర్వే నెంబర్ 2 లో సగం ఊరు ఉన్నప్పటికీ, కేవలం కొన్ని దళిత ఇళ్లనే లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. 20 ఏళ్ల నుండి ఎమ్మార్వో, ఆర్ఐ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కూల్చివేసిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఎమ్మార్వో, ఆర్ఐ లను బాధ్యులుగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని అన్నారు. గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి, ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. నిజమైన పేదలను గుర్తించి, వారికి న్యాయం చేయాలని అన్నారు. ఇళ్లు కూల్చివేసే ముందు నాలుగు రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలని అన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకోవాలని అన్నారు. దళితులకు ఇల్లు కట్టుకునే హక్కు లేదా.?, ఇంత మందిని కాదని, కొన్ని ఇళ్లను మాత్రమే ఎందుకు కూల్చివేశారు.?, ఈ కూల్చివేతలు ఇంతటితో ఆగుతాయా లేక కొనసాగుతాయా.?, కూల్చివేసిన స్థలంలో ప్రభుత్వం ఏమి నిర్మించబోతోంది.?, ముఖ్యమంత్రి ఈ కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చారా.?

**ఎమ్మార్వో, ఆర్ఐ లకు బాధ్యత లేదా.?**

చిలిపిచేడ్ మండలంలోని ఇతర గ్రామాల్లో ఇలాంటి కూల్చివేతలు జరిగాయా.?,

గ్రామంలో సమావేశం ఎందుకు ఏర్పాటు చేయలేదు.? అని ప్రభుత్వం పై పలు ప్రశ్నలు సంధించారు. కూల్చివేసిన ఇళ్లకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు.



## మద్ది మడుగు ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందుకున్న నాంపల్లి మాజీ ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతా రవీందర్ రెడ్డి దంపతులు..

### ఆంజనేయస్వామికి సేవలో పాల్గొనడం మా పూర్వజన్మ సుకృతం:

### మాజీ రైతు బంధు సమితి కన్వీనర్ ఏడు దొడ్ల రవీందర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాగర్ కర్నూలు జిల్లా, పదర మండలం పరిధిలో గల మద్ది మడుగు గ్రామంలో గల అత్యంత ప్రసిద్ధి చెందిన, భక్తుల కోరికలు తీర్చే శ్రీ శ్రీ శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవస్థానంలో తేదీ 10/04/2025 నుండి 12/04/2025 వరకు జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాలకు దేవస్థాన కమిటీ చైర్మన్ దేశావత్ రాములు, దేవస్థాన ప్రధాన అర్చకులు వీరయ్య, చందు నాయక్ నాంపల్లి మండల మాజీ ఎంపీపీ ఏడు దొడ్ల శ్వేతా రవీందర్ రెడ్డి దంపతులను హైదరాబాద్ లోని వారి నివాసంలో లో కలిసి వారికి ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలలో పాల్గొనాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మద్ది మడుగు ఆంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలకు ఆహ్వానం అందుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది అని, స్వామి వారికి సేవ చేసుకోవడం మా పూర్వజన్మ సుకృతం అని అన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ లను ప్రజలు సద్వినియోగించుకోవాలి

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : సీఎం రిలీఫ్ ఫండ్ లను పేదలకు ప్రభుత్వం తరపున అందేలా చూస్తున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ కిస్మత్ పూర్ కు చెందిన ఎలుగని రాధికకు రూ.50 వేలు, పిరం చెరువుకు చెందిన గుంజ పద్మకు రూ.45 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయ్యాయి. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం మాజీ మేయర్ మహేందర్ గౌడ్ తో కలిసి అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమాన్ని అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకరి సురేష్ గౌడ్, క్యాతం పాపయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కౌన్సిలర్ శైలజ జన్మదిన వేడుకలు

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శైలజ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ ప్రకాష్ గౌడ్ శైలజ తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శైలజకు మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్స్ రామకృష్ణారెడ్డి,బుదోళ్లు కావ్య శ్రీరాములు,నార్సింగి మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, శ్రీరాములు,మార్కెట్ కమిటీ డైరెక్స్ ఏర్పుల కుమార్,లక్ష్మి శ్రీ, తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వున్నారు.



## హిందూ ముస్లిం బాయ్ బాయ్...ఈద్ మిలాప్ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ..

పవిత్ర మాసమైన రంజాన్ అంటే నాకు ఎంతో పరిపూర్ణమైన నమ్మకం..మాజీ మంత్రి పువ్వాడ..




**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా :** రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటూ ఐదు సార్లు నమాజ్ చేస్తూ ఏంతో పవిత్రతో పండగ జరుపుకుంటారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈరోజు ఖమ్మం షాదిఖానా నందు ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ అల్లా,వెంకటేశ్వరస్వామి,ఏసు నాకు ఒక్కటే నాకు ఏదేవుడు భరోసా ఇస్తాడనేది నామనసులో వేడుకుంటా..గీతలో చెప్పారు పరమాత్మ దర్మం అనేది ఒక్కటే నీ మతాన్ని గౌరవించినట్లుగానే ఇతర మతాలను కూడా గౌరవించు అని ఉంది. నేను ఏ మతాలు చూడకుండా ఖమ్మం ఔన్నత్వం కోసం పనిచేసాను.నాకు ఏదైనా సంకట పరిస్థితి ఉన్నప్పుడు నాకన్నా ముందు పనిచేసిన ఎమ్మెల్యేలను గుర్తుచేసుకుంటాను. ఈదుల్ పితర్ రోజున అందర్ని కలవలేక పోయాననే ఉద్దేశంతో ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొని అందర్ని కలిసే అవకాశం కలిగింది. మనమందరం ఐకమత్యంగా ఉండాలని అన్ని మతాలు ఒక్కటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హాఫిస్ జవాద్,మాజీ గ్రంథాలయ చైర్మన్ ఖమర్,జిల్లా మైనారిటీ అధ్యక్షుడు తాజుద్దీన్,ఘని, కార్పొరేటర్ మక్బుల్,జహీర్ అలీ,కొల్లి సత్యనారాయణ,నగర అధ్యక్షుడు నాగరాజు,కార్పొరేటర్ కర్నాటి కృష్ణ,కోటేశ్వరరావు, వలరాజు,జ్యోతిరెడ్డి,బుడిగం శ్రీను,మాజీ సుడ చైర్మన్ బచ్చు విజయ్,ఫిష్ సొసైటీ సుధాకర్, టౌన్ మైనారిటీ అధ్యక్షుడు షంసుద్దీన్,నాయకులు తోసిఫ్,ముజాహిద్,పిరోజ్,ఇజార్,చోటు,మున్నా,చంటి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవాలయ ఉండి లెక్కింపు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండవెల్లికిచర్ల గ్రామంలో ఏకశిలా పర్వతంపై వెలిసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు ఉగాదితో ముగిశాయి.ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు స్వామివారికి సమర్పించుకున్న హుండీ లెక్కలు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి బాల నరసయ్య ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈ హుండి లెక్కింపులో రూపాయలు 3,36,895/- అక్షరాల మూడు లక్షల 36 వేల ఎనమిది వందల తొంబై ఐదు రూపాయలు వచ్చినట్లు,అలాగే స్వామి వారికి మొక్కుబడుల రూపంలో భక్తులు సమర్పించుకున్న 8 కోడెలను వేలం వేయగా 64 500/- మనవిచెర్ల గ్రామానికి చెందిన రైతులు దక్కించుకున్నారని దేవాలయ కార్యనిర్మాధికారి బాల నరసయ్య మరియు దేవాలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శాంతికుమార్,మర్పల్లి మండల దేవాలయ ధర్మకర్త మండలి కార్యనిర్వాహణాధికారి, దేవాలయ అర్చకులు పాండు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు భక్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.




## నియో పోలీసు భూములను వెనక్కు తీసుకొని ఈకో పార్కును ఏర్పాటు చేయాలి

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలం వేసిన కోకాపేట నియో పోలీసు భూములను తిరిగి వెనక్కు తీసుకొని ప్రజలకు ఉపయోగపడేలా ఈకో పార్కును ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు నియో పోలీసు చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ.. కంచె గచ్చిబౌలీ భూముల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, ఐటీ కంపెనీల నిర్మాణానికి పూనుకున్న ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కేటీఆర్ వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కోకాపేట భూములను వేలం వేసినప్పుడు పర్యావరణంపై లేని ప్రేమ కంచె గచ్చిబౌలి భూములపై ఎందుకని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోట్లాది రూపాయల ముడుపులు తీసుకొని మై హెూమ్, రాజపుష్ప లాంటి సంస్థలకు భూములను కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా నిరుద్యోగుల కోసం ప్రభుత్వం చేస్తున్న పనులను అడ్డుకుంటే సహించేది లేదన్నారు.

## కుల్కచర్ల మండలంలోని పలు గ్రామాలలో అన్న బియ్యం పంపిణీ

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ షాపులలో ని సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ పథకము పేదలకు ఒక వరం లాంటిదని అందరూ ఆరోగ్యంగా ఉండేటట్లుగా ప్రభుత్వం కృషి చేస్తుందని పలువురు నాయకులు తెలిపారు. కుల్కచర్లలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి ఇప్పాయిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి అయూబ్, రేషన్ డీలర్ కే నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ కురుంపల్లి.నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెన్నచేటి అంజిలయ్య, జంగం మల్లయ్య, ఏంకంటి రాములు, కమ్మరి నర్సింలు, నీల రఘు, పసుల మధు,ఎర్రం వెంకటయ్య,గాదే రాములు, చాకలి రాములు, ఎర్రం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 5-4-2025


# మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్

## వీరి వద్ద నుండి రూ. 18,20,000/- విలువ గల 24 మోటార్ సైకిళ్ళ తో పాటు 3 సెల్ ఫోన్ లు స్వాధీనం.

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి.





**క్రైమ్ మిర్రర్, నల్గొండ బ్యూరో :** నల్గొండ జిల్లా నకిరేకల్ పట్టణ పరిధిలో మోటార్ సైకిళ్ళ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 18,20,000/- విలువ గల 24 మోటార్ సైకిళ్ళ తో పాటు 3 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ పట్టణ పరిధిలో మోటర్ సైకిళ్ళ వరుస దొంగతనాలు జరుగుతున్నందున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో నకిరేకల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తేది 03.04.2025 న సాయంత్రం 5 గంటల సమయం లో నకిరేకల్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ రాజ శేఖర్, ఎస్సై లచ్చి రెడ్డి, కానిస్టేబుల్స్ శ్రీను, సురేష్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు 100 డయల్ సిబ్బంది తో కలిసి నకరేకల్ టౌన్ లోని ఇందిరా గాంధి చౌరాస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, సాయంత్రం 6 గంటల సమయం లో ఒక ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్ %ూ 05 జూ% 6553 నెంబర్ గల దాని మీద (%ూ%-1) పాలడుగు అశోక్ మరియు ఇంకొక నెంబర్ ప్లేట్ లేని స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్ మీద ఇద్దరు వ్యక్తులు (%ూ-2 ఆూ%-3) తిప్పర్తి రోడ్ వైపు నుండి వస్తుండగా, అట్టి రెండు మోటార్ సైకిళ్లను ఆపి డాక్యుమెంట్లు, లైసెన్స్ లను చూపించమని అడుగగా, వారి వద్ద లేవని చెప్పినందున, మొదట మోటార్ సైకిల్ %ూ 05 జూ% 6553 ను ఈ చలాన్ యాప్ లో చెక్ చేయగా, సదరు నెంబర్ గ్లామర్ మోటార్ సైకిల్ కు సంబంధించినది గా చూపించింది. బైక్ వేరే, నెంబర్ వేరే ఉండడంతో అనుమానం వచ్చి వారిని విచారించగా అట్టి మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి పాలడుగు అశోక్ తాను అట్టి మోటార్ సైకిల్ ను నకిరేకల్ లో దొంగతనం చేశానని, అట్టి మోటార్ సైకిల్ కు వున్న %ూ-05-జు%-3097 నెంబర్ ప్లేట్ ను తీసి వేసి తన వద్ద వున్న ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్ కి ఏర్పుల పరశురాములు అనే వ్యక్తి యొక్క గ్లామర్ బైక్ నెంబర్ ప్లేట్ ను బిగించి ఎవరికి అనుమానం రాకుండా తిరుగుతున్నానని చెప్పడం జరిగింది. తాను మరియు ఏర్పుల పరశురాములు (%ూ%-2), బోడ సాయిరాం(%ూ%-3) లు ముగ్గురు కలిసి నకిరేకల్ లో (09), సూర్యాపేట(01), చౌటుప్పల్(01), హయత్ నగర్(03), వనస్థలిపురం (01), ఎల్బీనగర్ (05), చైతన్యపురి (01), మరియు మరో మూడు మోటార్ సైకిళ్ళు కలిపి మొత్తం (24) మోటార్ సైకిళ్ళ ను దొంగిలించారు. కాగా హోటల్ ల ముందు, బార్ షాప్ ల ముందు మరియు ఇండ్ల ముందు పార్క్ చేసిన వాటిని పాత తాళం చెవి లతో లాక్ ఓపెన్ చేసి దొంగిలించి, వాటిలో కొన్నింటిని పరశురాములు మరియు సాయిరాం లు (11) బైక్ లను వారికి తెలిసిన వారికి అమ్మడం జరిగిందని, మిగతా (13) బైక్ లను నిర్మాణం లో వున్న పాలడుగు అశోక్ ఇంటి వెనకాల దాచి పెట్టగా, వారి వద్ద నుండి మొత్తం (24) మోటార్ సైకిళ్ళ ను స్వాధీన పర్చుకుని, శుక్రవారం నేరస్తులైన %ూ%-1. పాలడుగు అశోక్, %ూ%-2. ఏర్పుల పరశురాములు మరియు %ూ%-3. బోడ సాయిరాం లను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడం జరిగిందని ఎస్పీ తెలిపారు. కాగా నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి గారి పర్యవేక్షణలో నకిరేకల్ సి.ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించిన ఎస్సై లచ్చి రెడ్డి, కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, శ్రీను, సురేష్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు ను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

**నేరస్తుల వివరాలు:**

A-1. పాలడుగు అశోక్ S/o సోమయ్య, వ. 30 సం. లు, కులం: మాదిగ, వృత్తి: కూలి, R/o SC కాలని, తాటికల్ రోడ్, నకరేకల్ టౌన్. A-2. ఏర్పుల పరశురాములు S/o సామ్యేల్, వ. 32 సం. లు, కులం: మాదిగ, వృత్తి: JCB డ్రైవర్, R/o అక్కినెపల్లి గ్రామం, నార్కెట్ పల్లి మండలం. A-3. బోడ సాయిరాం S/o ఎల్లయ్య, వ. 31 సం. లు, కులం: మాదిగ, వృత్తి: లారీ డ్రైవర్, R/o తిరుమలగిరి గ్రామం, నార్కెట్ పల్లి మండలం.



రంగారెడ్డి జిల్లా ఉప్పర్ పల్లిలో గల రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయ స్థానం అడ్వకేట్ బార్ అసోసియేషన్ కు జరిగిన అంతర్గత ఎన్నికలలో ముఖ్య కార్యదర్శిగా ఎన్నికైన జీ.బందయ్య శుక్రవారం తమ బాధ్యతలను విధి విధానాలతో స్వీకరించారు. ఈ సందర్భంగా మణికొండ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధనరాజ్, సయ్యద్ రఫీక్, ఎర్రోళ్ల కుమార్, హరిబాబు, వినోద్ కుమార్ లు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్)**

## ద్విచక్ర వాహన దారులు అన్ని పత్రాలు కలిగి ఉండాలి

## లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ద్విచక్రాన్ని నడిపే వాహనదారులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని కుల్కచర్ల ఎస్సై అన్వేష్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనదారులకు తనిఖీ చేసి జరిమానా విధించారు. వారికి అవగాహన కల్పించారు. సంబంధించిన సరైన పత్రాలు లేని వాటికి పోలీస్ స్టేషన్ కి తరలించామని ఎస్సై అన్వేసి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఖాజా, శేఖర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుని జన్మదినం

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతకాయల జంగయ్య పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కేక్ కట్ చేయించి శాలువాతో ఘనంగా సన్మాని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల మండలం యువజన కాంగ్రెస్ నాయకులు పి.భాస్కర్, గుండా బాలకృష్ణ కొమ్ము శ్రీనివాస్, పుర్ర బాబు. బక్కని శ్రీను బొమ్మిరెడ్డిపల్లి మొగులయ్య, గోపాల్ నాయక్, బాలు నాయక్ జానీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# మహానీయుల జయంతి ఉత్సవాలకు అనుమతిని కోరిన ఉత్సవాల కమిటీ సభ్యులు





గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం జరగబోయే మహనీయుల జయంతి ఉత్సవాలకు సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ-2025 పోలీసు అధికారులను కోరారు. అందులో భాగంగా డాక్టర్ బాబు జాగ్జీవన్ రామ్ 118 వ జయంతి కార్యక్రమం కోసం పోలీసుల అనుమతిని కోరారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ సిఐ కాస్ట్రో, అత్తాపూర్ సీఐ, మైలార్ దేవ్ పల్లి సీఐ, ట్రాఫిక్ సీఐ రాజేందర్ గౌడ్ లను కలిసి డాక్టర్ బాబు జాగ్జీవన్ రామ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, కోశాధికారి మంగాలారం శ్రీనివాస్, ప్రముఖులు జయంతి కార్యక్రమానికి రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్ గౌడ్ తో కలిసి జయంతి సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. అందరిని ఆహ్వానించి సభా స్థలాన్ని పరిశీలించిన వారిలో మహనీయుల జయంతి ఉత్సవాల వ్యవస్థపాక అధ్యక్షులు పోయిల జీవన్ దాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహా మాదిగ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ మద్దిలేటి మాదిగ, గడ్డం సామెల్, మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజ్ కుమార్, పంబాల రాజు, ఎడ్లకాడి చంద్ర శేఖర్, బర్ల సుమన్, కవ్వగూడెం గౌతమ్, బండారి సుదర్శన్, కోడూరి రాజు, ఆదిరాల రవి కుమార్, రగడంపల్లి శ్రావణ్ తదితరులు ఆహ్వానించి సభా స్థలాని పరిశీలించిన వారిలో ఉన్నారు.



# శ్రీ సీతారాముల కళ్యాణానికి ముస్తాబైన రామలయం



చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగవరం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ దాచేపల్లి మనోహర్ గుప్తా మాట్లాడుతూ... సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ సందర్భంగా దేవాలయంలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం సమాజ శ్రేయస్సు కోసం దేవాలయంలో శ్రీ రామకోటి యజ్ఞం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ అని అన్నారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా ఆరో తారీకు అనగా ఆదివారం రోజున సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గ్రామ, వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణ కార్యక్రమాన్ని తిలకించవలసిందిగా కోరారు. రామకోటి మహాయజ్ఞ హోమ కార్యక్రమంలో శ్రీ ఆది మహావిష్ణు దేవాలయ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి పుష్ప దంపతులు పాల్గొని హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు, శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి సహకరిస్తున్నటువంటి భక్తులందరికి దేవాలయ కమిటీ, ఉత్సవ కమిటీ, బాల భక్త సమాజం కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.



# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం పీఎం శ్రీ మణికొండ పిఎంసి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అన్యువల్ డే వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, మండల విద్యాధికారి విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, ప్రజా ప్రతినిధులు నాయకులు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నృత్య ప్రదర్శనతో అందర్నీ అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు అన్ని విధాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయని సర్కార్ బడిలో చదివిన పిల్లలు బాగా చదువుకుని ఉన్నతమైన స్థానాలకు చేరాలని పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏర్పుల కుమార్, లక్ష్మీ శ్రీ, ప్రేమ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..........



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9393446188



## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను కలిసిన జగిత్యాల జిల్లా బాబు జగ్జీవన్ రామ్ & అంబేద్కర్ ఉత్సవ కమిటీ కన్వీనర్ బంగారు దీపక్...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** నూతనంగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్గా ఎన్నికైన సందర్భంగా జగిత్యాలకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా బక్కి వెంకటయ్యగారిని , తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షుడు బంగారు దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆశ్రయించిన ప్రతి దళిత గిరిజనులకు న్యాయం జరిగేలా కమిషన్ కృషి చేయాలని అలాగే దళితులపై జరుగుతున్న దాడుల %ఽ% సమస్యల గురించి వివరించడం జరిగింది . లిఈ కార్యక్రమంలో దుబ్బాక రమేష్ సీనియర్ అంబేద్కర్ సంఘం నాయకులు మాస్టిన్ సంగం రాష్ట్ర అధ్యక్షులు ముద్దుల గంగ నరసయ్య ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెట్పెల్లి లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఆమె కలెక్టరా లేక కాంగ్రెస్ కార్యకర్త నా... ?

## మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి. జగదీష్ రెడ్డి.



**క్రైమ్ మిర్రర్, నల్గొండ:** నల్గొండ జిల్లా కలెక్టర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి. జగదీష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తో కలిసి నల్గొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్పంచ్ లు స్థానిక మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలవకుండా బిల్లులు విడుదల చేయొద్దని కలెక్టర్ మాట్లాడిన అన్ని రికార్డింగ్స్ మా దగ్గర ఉన్నాయని పేర్కొన్నారు. చట్టపరంగా పని చేయకపోతే రికార్డింగ్స్ తో సహా కలెక్టర్ మీద ఫిర్యాదు చేయాల్సి వస్తుందని జగదీష్ రెడ్డి హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారులు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టాలని తమ కింది స్థాయి అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని.. ఒక్కరి పైన కేసు పెడితే 1000 మంది పోలీస్ స్టేషన్ కు వస్తారన్నారు. అధికారులు చట్టానికి లోబడి పని చేయకుండా, కాంగ్రెస్ మంత్రి చెప్పినట్టు నడుచుకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జగదీష్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా మంత్రులు ఉత్తమ్, వెంకట్ రెడ్డిలు ప్రజాసమస్యలు గాలికి వదిలి హెలికాప్టర్లలో తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా వ్యవసాయం దండగే అయ్యిందన్నారు. మంత్రులు కమిషన్ లు తింటూ దళారులకు అమ్ముడు పోయారన్నారు. నల్గొండలో ఓ మంత్రి సోయి లేకుండా ఎప్పుడూ మైకంలోనే ఉంటున్నాడని, రైతులంటే ఆయనకు లెక్క లేదని.. కమీషన్ల దందాలో నిమగ్నమయ్యాడన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు అన్ని రంగాల్లో విఫలం అయ్యారని, ఇంతవరకూ పంటకు బోనస్ లేదు, రుణమాఫీ అసంపూర్తిగా వదిలేశారన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండగ లా ఉండేదని..కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చిందని విమర్శించారు.

# ట్రినిటీ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

## ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల







చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కె వి బి కృష్ణారావు లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ వేడుకలలో విద్యార్థులు ప్రత్యేక దుస్తులు ధరించడంతో అందరిని ఆకట్టుకున్నారు. ప్రీ ప్రైమరీ, నర్సరీ, ఎల్ కే జి, యూకేజీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కె వి బి కృష్ణారావు విద్యార్థులను నియామక పత్రాలతో అభినందించి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉజ్జిని మంజుల మాట్లాడుతూ... విద్యార్థులకు మెరుగైన విద్యను అందించుటకు పాఠశాల ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణ, అంకిత భావం, పట్టుదల ముఖ్యమన్నారు. అనంతరం పాఠశాల చైర్మన్ కె వి బి కృష్ణారావు మాట్లాడుతూ... విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ద్వారా మంచి ఉల్లాసాన్ని అందించడానికి, భవిష్యత్తు పట్ల అవగాహన పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాలలో యూకేజీ 310 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ముగించుకొని ఒకటవ తరగతికి ప్రమోట్ అయిన సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థలు నిర్వహించిన స్నాతకోత్సవంలో యూకేజీ విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వైజ్ఞానిక సాంస్కృతిక, సామాజిక బాధ్యతలు, వారి వారి లక్ష్యాలు వారు యూకేజీ నందు నేర్చుకున్న పద్యాలు, దేశాలు వాటి రాజధానులు, భారతావనిలోని రాష్ట్రాలు వాటి రాజధానులు, మన దేశం యొక్క ఎల్లలు, నదులు వాటి పరివాహక ప్రాంతాల రాష్ట్రాల యొక్క ప్రాముఖ్యత, పూర్వకాలంలో ఆటలాడుకోవడం వలన లబ్ధి పొందే ఏకాగ్రత శారీరక దృఢత్వం ఇప్పుడు అలవర్చుకున్న మొబైల్ ఫోన్ లాభనష్టాలు కళ్ళకు కట్టినట్టు వారి తల్లిదండ్రుల ముందు ప్రదర్శించారని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల ప్రదర్శనలు చూసి పాల్గొన్న తల్లిదండ్రులు ఉత్తేజితులై వారు కూడా లయబద్ధంగా నాట్యం చేశారన్నారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కె వి బి కృష్ణారావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## తాయి బజార్ వేలాన్ని నిలిపివేయాలి

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : భారత పార్లమెంట్ చట్టం - 2014 ప్రకారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో తాయి బజార్ వేలంను నిలిపివేసి వసూళ్లను నిలిపివేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ ముఖ్య కార్యదర్శి షేక్ ఆరీఫ్ మొహమ్మద్, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపడుతున్న అక్రమ వసూళ్లను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిరు వీధి వ్యాపారుల రక్షణార్థం, వారి జీవనోపాధి సరళంగా సాగడానికి అనుకూలంగా భారత పార్లమెంట్ యాక్ట్ 2014 ను అమలు పర్చడం జరిగిందన్నారు. ఆ చట్టానికి పూర్తి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా 2020 సంవత్సరంలో జూన్ నెల 10 వ తేదీన గవర్నమెంట్ ఆర్డర్ 89 విడుదల చేయడం జరిగిందని వివరించారు. మణికొండ మున్సిపాలిటీ వారు తలపెట్టిన తాయి బజార్ వసూళ్లు చట్ట విరుద్ధమని, వీధి వ్యాపారుల రక్షణ పేరుతో వారిని భక్షిస్తున్నారన్నారు. కావున మణికొండ మున్సిపాలిటీ యాక్షన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉపేందర్నాథ్ రెడ్డి, కోశాధికారి దిలీప్ కక్కడ్, కమిటీ సభ్యులు బొడ్డు శ్రీధర్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

## కలకలం రేపిన కార్మికుడి ఆత్మహత్య



గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : రాజేంద్రనగర్ లోని పీవీ నరసింహారావు వెటర్నరీ కాలేజీలో కార్మికుడిగా పని చేస్తున్న మహమ్మద్ యూసఫ్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో కాలేజీ ఆవరణలో ఉన్న ఓ గేటుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక బుద్వేల్ బస్తీలో ఉంటున్న మహమ్మద్ యూసఫ్ కొన్నేళ్ళుగా వెటర్నరీ కాలేజీలో లేబర్ గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులకు వచ్చిన యూసుఫ్ సాయంత్రం కాలేజీ ఆవరణలో ఉన్న గేటుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మసీదుగూడెం లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

### లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా పనులు ప్రారంభించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి

చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, మసీదుగూడెం గ్రామంలో శుక్రవారం జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. హౌసింగ్ పనులకు అధికారులు మార్కింగ్ చేసిన స్థలాల్లో లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా పనులు ప్రారంభించాలని అన్నారు. సీఈవో శోభారాణి వెంట చౌటుప్పల్ ఎంపీడీవో సందీప్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

## అంకిరెడ్డిగూడెం లో వీధికుక్కల కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలి

### తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అంకిరెడ్డిగూడెం గ్రామ కమిటీ సభ్యులు భీమనగోని బాలరాజు యాదవ్



చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో వీధికుక్కల, కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం అంకిరెడ్డిగూడెం గ్రామ కమిటీ సభ్యులు భీమనగోని బాలరాజు యాదవ్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామంలో గొర్రెల, మేకల మందల పై వీధికుక్కలు పడి గొర్రెలను మేకలను చంపేస్తున్నాయని అన్నారు. అదేవిదంగా కోతులు విపరీతంగా ఉండటం వలన గ్రామంలో స్థానికులను, బాటసారుల పై ఎగబడుతూ వారిని గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి కొండే శ్రీశైలం మాట్లాడుతూ... గ్రామంలో ఉన్నటువంటి నీటితోట్లకు మరమ్మతులు చేయించి గొర్రెల మేకలకు, పశువులకు నీరు అందించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలో వీధికుక్కల, కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండు కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు భీమనగోని బాలరాజు, గ్రామ జి.ఎం.ఎస్ నాయకులు బర్మా లింగస్వామి, బర్మా బంజారా బెడద మల్లేశం, బెడద శ్రీనివాసు, ఎర్రగోని శ్రీనివాసు, దండగ జంగయ్య, యాదయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో స్లాట్ బుకింగ్‌కు కొత్త విధానం

## వినియోగదారులు క్యూ

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** రిజిస్ట్రేషన్ వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు ఏపీ ప్రభుత్వం ఓ సరికొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం కొత్త విధానంగా స్లాట్ బుకింగ్ వ్యవస్థను మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రారంభించారు. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని ప్రధాన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లో స్లాట్‌ను బుక్ చేసుకుని, నిర్ణీత సమయంలో కార్యాలయానికి వెళ్లి తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఈ కొత్త విధానం వల్ల కార్యాలయాల్లో రద్దీ తగ్గడంతో పాటు, పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన కార్యాలయాల్లో కూడా త్వరలో ఈ విధానాన్ని విస్తరించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ.. నిరు పేదలకు అండగా ఉంటూ..వారికి న్యాయం చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందని..ఈ మేరకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. ఇలాంటి కొత్త సంస్కరణలతో రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం ఉండదని మంత్రి అనగాని స్పష్టం చేశారు. ఇక మీద రిజిస్ట్రేషన్‌ల కోసం రోజులు తరబడి వేచి చూసే అవసరం లేదన్నారు. అమ్మకదారులు, కొనుగోలుదారులు, సాక్షులు.. ఇలా ఎవరికీ ఇబ్బంది లేకుండా స్లాట్ బుకింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంటుందన్నారు. భూ వివాదాలు లేకుండా కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. అభివృద్ధి కోసమే నాలా చట్టాన్ని తీసేసి కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్నారు. మంచి ఫలితాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# మైనింగ్ ఆదాయం పెంచేలా చర్యలు

**ఒంగోలు, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో మైనింగ్ రంగంలో ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మైనింగ్‌లో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. నూతన పాలసీతో మైనింగ్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రకాశం జిల్లా గొల్లాపల్లిలో బిల్డింగ్ మెటీ-రియల్ సెజ్‌లో రవీంద్ర పర్యటించారు. గ్రానైట్ కటింగ్, క్వార్ట్జ్ నుంచి భవన సామగ్రి తయారీ యూనిట్లను పరిశీలించారు. ప్రకాశం జిల్లాలో 1,500కి పైగా మైనింగ్ సంస్థలు ఉన్నట్లు- ఆయన తెలిపారు. ఒంగోలు సెజ్‌లో వందకుపైగా ఎ÷-లాంట్లు- వస్తున్నాయన్నారు. ప్రాసెసింగ్ రంగంలో విస్తారమైన ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. వివిధ ఖనిజాల ఎగుమతితో ఆదాయం పెంచుకునేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు- తెలిపారు.

# రియల్ వ్యాపారులతో మంత్రి నారాయణ చర్చలు



**బెంగళూరు, (క్రైమ్ మిర్రర్):** బెంగళూరు పర్యటనలో ఉన్న ఏపీ పురపాలక మంత్రి నారాయణ బృందం రియల్ వ్యాపారులతో భేటీ అయ్యింది. అమరావతిలో పెట్టుబడులపై చర్చించింది. మంత్రి తదితరులు శుక్రవారం బెంగళూరులో పర్యటించారు. అక్కడ ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌లు, రియల్టర్స్‌తో మంత్రి నారాయణ బృందం సమావేశమైంది. స్థిరాస్తి వ్యాపారం అభివృద్ధి కోసం తీసుకున్న మోడల్స్‌ను అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమరావతిలోనూ ప్రైవేటు- సంస్థల ద్వారా రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ బెంగళూరులో పర్యటించారు. మంత్రి వెంట సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, పలువురు అధికారులు ఉన్నారు.

# మద్యం స్కామ్ కేసులో కసిరెడ్డికి చుక్కెదురు

## పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** మద్యం స్కాం కేసులో సీఐడీ నోటీసులను సవాలు చేసిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. తొందర పాటు చర్యలు తీసుకోకుండా సీఐడీకి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వటానికి కూడా హైకోర్టు నిరాకరించింది. 164 స్టేట్‌మెంట్ ఇవ్వటానికి వెళ్తే అరెస్టు చేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించారు. విచారణకు కొంత సమయం ఇవ్వాలని కోరటంతో ఆ దిశగా నోటీ-సులు జారీ చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం వ్యవహారం పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం కుంభకోణంలో తెర వెనుక లావాదేవీలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నించింది. ఈ కుంభకోణంలో మొత్తం వ్యవహారాన్ని గత ప్రభుత్వంలో ఐటీ- సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెర వెనుక ఉండి నడిపించారని ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఆయన గురించి కామెంట్స్ చేయడం ఆ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూర్చింది. వేల కోట్ల వ్యాపారంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారనే ఆరోపణలతో కసిరెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి.

# నామినేటెడ్ పదవుల పంపకం

## మరో 38 మార్కెట్కమిటీలకు ఛైర్మన్ల ప్రకటన

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. అందులో భాగంగా మరో 38 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల పేర్లను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. ఈ ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 31 టీడీపీ, 6 జనసేన, 1 బీజేపీ నేతలకు కేటాయించింది. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకోసం కసరత్తు జరుగుతోందని పేర్కొంది.దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో కూటమి నేతలకు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీ-డీపీ కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటులో భాగంగా పలువురు సీనియర్లు ఎన్నిక వేళ.. సీట్లు వదులు కోవాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం నామినేటెడ్ పోస్టులు కట్టబెడతామంటూ వారికి హామీ సైతం ఇచ్చారు. ఇక సదరు ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు మొత్తం 175కి 164 స్థానాలకు గెలుచుకున్నాయి. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

# శ్రీశైలం ఘాట్ రోడ్డులో కారులో మంటలు

## వెంటనే దిగి ప్రాణాలు దక్కించుకున్న భక్తులు

**నంద్యాల, (క్రైమ్ మిర్రర్):** శ్రీశైలం ఆలయానికి వెళ్తుండగా పెద్ద ప్రమాదం చోటు చేసుకుంది.. అయితే, ఈ ప్రమాదంలో త్రుటిలో తప్పించుకుని ప్రయాణికులు బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీశైలం నల్లమల ఘాట్ రోడ్డులో మంటలు చెలరేగి భక్తుల కారు దగ్ధం అయ్యింది.. గుంటూరుకు చెందిన భక్తులు ఇన్నోవా కారులో శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది.. చిన్నారుట్ల సమీపంలో కారు ఇంజిన్ భాగంలోని బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ తో పొగలు వచ్చాయి.. అయితే, పొగలు రావడంతో అప్రమత్తమైన భక్తులు వెంటనే ఆ కారులో నుంచి బయటకు దిగారు..

# ఎపిలో మూడు కొత్త ఇండస్ట్రియల్ పాలసీలు

## యువత మహిళలకు పెద్దపీట వేసేలా మార్గదర్శకాలు

## పాలసీలను ఆవిష్కరించిన మంత్రులు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మూడు ఇండస్ట్రియల్ పాలసీలు తీసుకుని వచ్చేందుకు రంగం సిద్ధం చేశారు.. అలాగే వాటిని ఆచరించే విధంగా గైడ్ లైన్స్ కూడా సిద్ధం చేశారు.. గత ప్రభుత్వం పాలసీలు చేసి గైడ్ లైన్స్ ఇవ్వకుండా వదిలేసిన వాటికి సైతం గైడ్ లైన్స్ ఇచ్చారు... యువ పారిశ్రామికవేత్తలకు, మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ మూడు ప్రధాన పాలసీలను రూపొందించారు.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడమే ప్రధాన టార్గెట్ గా పని చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవల మంత్రులకు దిశానిర్దేశం చేసిన విషయం విదితమే కాగా.. దీనిలో భాగంగా ఇండస్ట్రియల్ పాలసీలను తయారు చేసారు... వాటిలో మూడు పాలసీలను మంత్రులు ఆవిష్కరించారు.. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసి, పారిశ్రామిక వేత్తల అభివృద్ధి పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ... మంత్రులు టి.జి.భరత్, కొండపల్లి శ్రీనివాస్ లు ఆవిష్కరించారు.. ఫుడ్ ప్రాసెసింగ్, పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలు ఆవిష్కరించారు.. వాటికి గైడ్ లైన్స్ సైతం ఆవిష్కరించారు. గత ప్రభుత్వం లో ఏపీకి రాకుండా పోయిన పరిశ్రమలని తీసుకొచ్చేలా పాలసీలు చేస్తున్నారు. ప్రతీ జిల్లాకి ఒక ఇండస్ట్రియల్ పార్క్ తీసుకురావడం, అలాగే మండలానికి ఒక చిన్న ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేయడం లక్ష్యాలుగా నిర్ణయించారు..

పరిశ్రమలలో పెట్టు-బడి పెట్టడమే కాకుండా ఇచ్చే ఉద్యోగాల సంఖ్య ఆధారంగా ఇన్సెంటివ్ లు ఇవ్వాలని నిర్ణయించారు.. అలాగే గత ప్రభుత్వం లో ఇన్సెంటివ్ లు పొందని వారి వినతులు కూడా పరిశీలించిన మంత్రివర్గ ఉపసంఘం, అవి కూడా పరిష్కరించాలని నిర్ణయించారు... 3, 4 మోడళ్లలో పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు చేసారు.. ఎస్సీ, ఎస్టీలకు 3 మోడల్ లో అవకాశాలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు.. టెక్నికల్ డెవలప్మెంట్ లో భాగంగా ఆఒ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు... ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉన్న అన్ని డిపార్ట్మెంట్ ల వారీగా పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు



చేస్తున్నారు.. భూముల కేటాయింపుకు కూడా తగిన పాలసీ, లాజిస్టిక్స్ పాలసీ సైతం రూపొందిస్తున్నారు.. ఏదేమైనా.. ఇండస్ట్రియల్ పాలసీలు తీసుకురావడం, గైడ్ లైన్స్ కూడా ఇవ్వడం ద్వారా 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం తథ్యం అని ప్రభుత్వం చెపుతోంది. తాజా గైడ్‌లైన్స్ ద్వారా స్టార్టప్ లకు, యువ పారిశ్రామికవేత్తలకు, మహిళలకు అవకాశాలు ఇచ్చేలా పాలసి రూపొందించారు.. అలాగే లాజిస్టిక్స్ కు సంబంధించిన కొత్త పాలసీ సైతం సిద్ధం చేస్తున్నారు.. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పాలసీలు ఇచ్చింది.. కానీ గైడ్ లైన్స్ ఇవ్వలేదు... అవి కూడా మేమే ఇస్తున్నాం.. పాలసీలు ఎలా వినియోగించుకోవాలో అనేది గైడ్ లైన్స్ ద్వారానే తెలుస్తుంది.. ఉద్యోగాలు ఎన్ని ఇస్తారో అనే దానిపైన ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్ ఉంటుంది.. ఏపీ పారిశ్రామిక అభివృద్ధికి ఈ పాలసీలు, గైడ్ లైన్స్ ఉపయోగపడతాయి అన్నారు.. ఈ పాలసీలు, గైడ్ లైన్స్ ద్వారానే పరిశ్రమలు ఏర్పడతాయి.. మే 15 నుంచీ ఎస్కో అకౌంట్ విధానం ఆవిష్కరిస్తున్నాం.. విధాన పరమైన అంశాలు పూర్తి చేస్తే ఇన్సెంటివ్ లు డైరెక్టుగా వచ్చేస్తాయి.. వచ్చే నెల నుంచి 3 వేల నుంచి 5 వేల కోట్ల వరకూ ఇన్సెంటివ్స్ ఇస్తాం.. ఘాఒఈ, ఘాఒఇ, కేబినెట్ లో క్లియర్ అయిన దాని ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాం అని చెపుతున్నాం.. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సిందే అని మంత్రుల సమావేశంలో చెప్పారని టీజీ భరత్ తెలిపారు.. ఇక, పార్క్ పాలసీ, ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ పాలసీ, కొన్ని ప్రధాన పోర్టళ్ళు ఇవాళ ఆవిష్కరించాం అని వెల్లడించారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. రాష్ట్ర అభివృద్ధి ఎలా చేయాలి అనే దానిపై సీఎం ఎన్నో నిర్దేశాలు చేసారు.. ఇండస్ట్రియల్ పార్టనర్ లు అందరితో చర్చించిన తరువాత పాలసీలు చేసాం.. 4 మోడల్ అనేది దేశంలో ఎక్కడా లేదు... ఇండస్ట్రియల్ పార్క్ లు 4 విధానంలో అభివృద్ధి చేస్తాం.. ఇండస్ట్రియలిస్టులు, అన్ని అసోసియేషన్ ల ముందు పాలసీలు, గైడ్ లైన్స్ ఆవిష్కరించాం.. సీఎం మాకు చాలా సమయం ఇస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో పరిపాలన అంశాలలో చాలా లోపాలు జరిగాయి.. ఇప్పుడు యువ వ్యాపారవేత్తలను తీసుకురావడానికి ప్రధాన దృష్టి పెట్టాం.. ఒకొక్క జిల్లాలో ఒక ఇండస్ట్రియల్ పార్క్, మండలానికి ఒక చిన్న ఇండస్ట్రియల్ పార్క్ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.. ఇప్పటికే ఉన్న పరిశ్రమలలో ఉన్న ఇబ్బందులు కూడా సరిచేసేలా పాలసీ చేశామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# వక్ఫ్ బిల్లుపై జగన్ డబుల్ స్టాండర్డ్

## లోక్‌సభలో వ్యతిరేకత..రాజ్యసభలో ఓటు

## వక్ఫ్ బిల్లుపై అభిప్రాయం చెప్పలేని పిరికినేత

## మండిపడ్డ టిడిపి నేతలు

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** వక్ఫ్ బిల్లుపై జగన్ డబుల్ స్టాండర్డ్ బయటపడిందని, లోక్‌సభలో వ్యతిరేకత..రాజ్యసభలో ఓటు దేనికి సంకేతమో చెప్పాలని టిడిపి డిమాండ్ చేసింది. వక్ఫ్ బిల్లుపై అభిప్రాయం చెప్పలేని పిరికినేత జగన్ అని దుయ్యబట్టింది. పార్లమెంట్ సాక్షిగా ముస్లింలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి దోకా ఇచ్చారని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రెడ్డి మాటలు ఒకలా ఉంటే చేతలు మరోలా ఉంటాయన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ డబుల్ స్టాండ్ ప్రదర్శించిందని.. ముస్లిం సమాజంపై వైసీపీ మోసపూరిత విధానం బయటపడిందని విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు నిన్నటి వరకు కబుర్లు చెప్పి నేడు మద్దతగా వైసీపీ ఎంపీలు ఓటు వేశారన్నారు. ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకునే జగన్ రెడ్డి కనీసం వారి సంక్షేమం కోసం ఈ సవరణ చేయాలని చెప్పే గొంతు రాలేదని ప్రశ్నించారు. 'దేనికి నీకు అంత భయం... ఇంత పిరికివాడివా జగన్ రెడ్డి' అని నిలదీశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ స్టాండ్ ఏంటనేది స్పష్టంగా చెప్పే ధైర్యం కూడా లేదా అంటూ మండిపడ్డారు. లోక్‌సభలో విప్ జారీ చేసి... రాజ్యసభలో ఎందుకు వదిలేశారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలపై వైసీపీ చిత్తశుద్ధి ఏంటో ఇప్పుడు చూపించారన్నారు. వైసీపీ ముస్లిం నాయకులంతా ఆ పార్టీని వీడాలన్నారు. 'వక్ఫ్



చట్ట సవరణ బిల్లుపై వైసీపీ స్టాండ్ ఏంటో చెప్పే ధైర్యం లేని వాడు మీకు నాయకుడా... సిగ్గులేదా' అంటూ నాగుల్ మీరా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వక్ఫ్ బిల్లుపై జగన్ ముస్లింలను మోసం చేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు మండిపడ్డారు. వైసీపీకి స్టాండ్ అనేది లేదన్నారు. టీడీపీ ఎప్పుడు ఒకే స్టాండ్ పై ఉందని వెల్లడించారు. వక్ఫ్ బిల్లు వల్ల ముస్లింలకు నష్టం జరగకూడదని టీడీపీ సవరణల సమయంలో చెప్పిందన్నారు. రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు వైసీపీ అనుకూలంగా ఓటు- వేసిందన్నారు. లోక్‌సభలో బిల్లుకు వైసీపీ వ్యతిరేకంగా ఓటు వేసిందని మండిపడ్డారు. జగన్ చేతగాని నాయకుడని విమర్శించారు. జగన్ తల్లిని చెల్లిని కాదు... ముస్లింలను మోసం చేశారంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాగా.. జగన్ డబుల్ స్టాండర్డ్ రాజకీయం మరోసారి బయటపడింది. వక్ఫ్ బిల్లుకు రాజ్యసభలో మద్దతుగా వైసీపీ ఎంపీలు ఓటేశారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు- నిన్నటి వరకు కబుర్లు చెప్పారు. అయితే ఎన్డీఏకు బలమున్న లోక్‌సభలో వ్యతిరేకించిన వైసీపీ... కేంద్రానికి కీలకమైన రాజ్యసభలో అనుకూలంగా ఓటేసింది. జగన్ సూచనలతో రాజ్యసభలో వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఎంపీలు ఓటు- వేసినట్లు తెలుస్తోంది.

# ఫార్మాసిస్ట్ ఆత్మహత్య బాధాకరం : పవన్‌కళ్యాణ్



**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** ఫార్మాసిస్ట్ నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. బాధిత విద్యార్థిని కుటుంబానికి కూటమి ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆత్మహత్యకు కారకుడిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. రాజమండ్రిలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి ఆత్మహత్య దురదృష్టకరమని.. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ ఆసుపత్రిలో ఇంటర్న్‌గా ఉన్న నాగాంజలి తన సూసైడ్ నోట్‌లో కారకుడిగా పేర్కొన్న ఆసుపత్రి ఏజీఎం డా.దువ్వాడ దీపక్‌ను ఇప్పటికే అరెస్టు చేసినట్లు పోలీసులు తెలియచేశారన్నారు. కచ్చితంగా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యార్థినులు, యువతుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు పోలీసు శాఖ కూడా మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టడంతో పాటు బాధిత వర్గం ఆవేదనను, భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. తోటి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడితే విద్యార్థులు ఆందోళనకు లోనవుతారని తెలిపారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో చోటు చేసుకున్న అత్యాచార, హత్య ఘటన సమయంలో మెడికోలు ఆందోళనలు చేయడాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు, యువతులకు భరోసా, ధైర్యం కల్పించాల్సిన బాధ్యత పోలీసులు తీసుకోవాలని సూచించారు.

# దీపికలా త్వరగా పూర్తి చేసేయాలి.. లేదంటే!

సాధారణంగా హీరోయిన్లు.. కెరీర్ ఫామ్ లో ఉన్నప్పుడు పెళ్లి-పిల్లల విషయంలో కాస్త ప్లానింగ్ తోనే ఉంటారు. కియారా అడ్వాణీ కూడా బహుశా ప్లానింగ్ తోనే ఉండొచ్చు. కాకపోతే ఇప్పుడు ఆమె ప్రెగ్నెన్సీ ఆ మూవీ టీమ్ కి కొత్త టెన్షన్ తెచ్చిపెట్టింది. ఇంతకీ ఏంటా సంగతి?హీరోయిన్ కియారా అడ్వాణీ.. రెండు రోజుల క్రితం తన ప్రెగ్నెన్సీ విషయాన్ని ప్రకటించింది. ఇది జరిగి రోజైన కాలేదు అప్పుడే షూటింగ్ కి కూడా హాజరైంది. ప్రస్తుతం ఈమె చేతిలో రెండు సినిమాలున్నాయి. వాటిలో 'వార్ 2'లో ఒకటి. ఇదివరకే ఈమె పార్ట్ షూటింగ్ అంతా పూర్తయినట్లు తెలుస్తోంది. మరోవైపు కేజీఎఫ్ ఫేమ్ యష్ కొత్త సినిమా 'టాక్సిక్'లోనూ ఈమెనే హీరోయిన్. తాజాగా కియారా అడ్వాణీ ప్రెగ్నెంట్ అని బయటపెట్టడంతో మూవీ టీమ్ కి టెన్షన్ పట్టుకుంది. ఎందుకంటే ఈమెకు బేబీ బంప్ కనిపించేలోపు కియారా పార్ట్ షూటింగ్ అంతా పూర్తి చేసుకోవాలి. లేదంటే తర్వాత సినిమా లేట్ అయ్యే అవకాశముంది. దీంతో ఈ ఒకటి రెండు నెలల్లో 'టాక్సిక్'లో కియారా పార్ట్ పూర్తవుతుంది. తర్వాత మిగిలిన పనులన్నీ చేసుకుంటారని తెలుస్తోంది. గతంలో 'కల్కి' షూటింగ్ జరుగుతున్న టైంలో దీపికా పదుకొణెకి కూడా ప్రెగ్నెన్సీతోనే షూటింగ్ అంతా పూర్తి చేసింది. తర్వాత ప్రమోషన్లలో మాత్రం కనిపించడం కుదరలేదు. దీపికలా ప్లానింగ్ తో చేసేసుకుంటే కియారాకి ఇబ్బందేం ఉండకపోవచ్చు. లేదంటే మాత్రం 'టాక్సిక్'కి తిప్పలు తప్పవు.





# హాయిగా నవ్వించి కష్టాలను మరిపించారు

'నవ్వించడం ఓ వరం. నవ్వు కష్టాలను మరిపిస్తుంది. ఈ సినిమా ఆ పనే చేసింది. ఆ విషయంలో దర్శకుడు కల్యాణ్‌శంకర్‌కి మనం థ్యాంక్స్ చెప్పాలి. సినిమాను హిట్ చేయడమే గొప్ప. దానికి సీక్వెల్ చేసి.. దాన్ని ఇంకా పెద్ద హిట్ చేయడం నిజంగా సామాన్యమైన విషయం కాదు. ఆ ఫీట్‌ను చేసిన దర్శకుడు కల్యాణ్‌శంకర్‌ను అభినందిస్తున్నా. ఇందులో పాత్రధారులంతా అద్భుతంగా నటించారు. కెమెరా, ఎడిటింగ్.. భీమ్స్ సంగీతం, కాసర్ల శ్యామ్ సాహిత్యం.. ఇలా ప్రతి క్రాఫ్ట్ ప్రాణం పెట్టి పనిచేశారు. ఇక నాగవంశీ.. మనిషి కరుకు, మనసు వెన్న. త్వరలో మేం కలిసి చేయబోతున్నాం. ఆ సినిమా గురించి తనే చెబుతాడు. ప్రశాంత్ నీల్ సినిమా తర్వాత 'దేవర2' కూడా ఉంటుంది. మీరు నాపై చూపిస్తున్న అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా ' అని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. నార్నె నితిన్, సంగీత్‌శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. బ్లాక్‌బస్టర్ 'మ్యాడ్' చిత్రానికి ఇది సీక్వెల్. కల్యాణ్ శంకర్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక, సాయిసౌజన్య నిర్మించిన ఈచిత్రం సక్సెస్ సెలబ్రేషన్స్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన తారక్ పై విధంగా స్పందించారు. చిత్ర టీమ్‌కి దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అభినందనలు అందించారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులంతా మాట్లాడారు.

# 'పుష్ప' టైటిల్ కహానీ!



'పుష్ప' ఫ్రాంఛైజీ చిత్రాలు రెండూ భారతీయ బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాలు దేశవ్యాప్తంగా రికార్డులను తిరగరాశాయి. పుష్పరాజ్ పాత్ర మాస్ ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అయింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాలో హీరోకి పుష్ప అనే పేరు ఎందుకు పెట్టాల్సి వచ్చిందనే విషయం గురించి దర్శకుడు సుకుమార్ ఆసక్తికరమైన వివరాల్ని వెల్లడించారు. తమిళనాడులో జరిగిన ఓ ఈవెంట్‌లో సుకుమార్ మాట్లాడారు. 'పుష్ప' సినిమాలోని హీరో పుష్పరాజ్ పాత్రను నిజమైన గంధపు చెక్కల స్మగ్లర్ నుంచి స్ఫూర్తిపొంది రూపొందించినట్లు చెప్పారు. 'ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఓ వెబ్‌సిరీస్ తీద్దామనుకొని పుష్పరాజ్ అనే స్మగ్లర్‌ను కలిశా. నాకెందుకో ఆ పేరు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. దాంతో అతన్ని ఇంటర్వ్యూ చేశాను. అదే పేరుతో సినిమా తీస్తే బాగుంటుందనిపించింది. సాధారణంగా 'పుష్ప' అనే పేరు మహిళలకు ఉంటుంది..కానీ ఓ స్మగ్లర్ అలాంటి పేరు పెట్టుకోవడం నన్ను ఆకర్షించింది అని సుకుమార్ తెలిపారు. ప్రస్తుతం సుకుమార్ మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

# గోప్యంగా ఉంచమని అమ్మ చెప్పింది

'మనిషికి మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసికంగా బలంగా లేకపోతే.. శారీరకంగా కూడా బలహీనపడే అవకాశం ఉంటుంది. మెదడు నుంచి శరీరానికి పాజిటీవ్ సిగ్నల్స్ వెళ్లాలి కానీ.. నెగెటివ్ సిగ్నల్స్ వెళ్లకూడదు. అలా జరిగితే ప్రమాదంలో పడతాం.' అంటూ చెప్పుకొచ్చింది బాలీవుడ్ భామ దీపికా పదుకొణె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కొన్నేళ్ల క్రితం మానసికంగా తాను ఎదుర్కొన్న సమస్యల్ని ఆమె గుర్తుచేసుకున్నది.




# ఓటీటీ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పిన అదితిరావు హైదరి

బాలీవుడ్‌లో 'జబ్ వియ్ మెట్, రాక్‌స్టార్, హైవే, లవ్ ఆజ్ కల్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారు ఇంతియాజ్ అలీ. తాజాగా ఈ దర్శకుడు 'ఓ సాథీ రే' అనే వెబ్ సిరీస్‌తో అసోసియేట్ అయ్యారు. కానీ దర్శకుడిగా కాదు. రైటర్, షో రన్నర్‌గా చేస్తున్నారు. ఈ సిరీస్‌కు అరిఫ్ అలీ దర్శకత్వం వహిస్తున్నారు. లవ్, హ్యూమన్ ఎమోషన్స్ ప్రధానాంశాలుగా ఉన్న ఈ సిరీస్‌లో అదితి రావ్ హైదరీ అర్జున్ రాంపాల్, అవినాష్ తివారీ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. "ఈ రోజుల్లో అప్పటి వింటేజ్ లవ్ ఫీల్‌ని ఈ సిరీస్‌తో వీక్షకులు అనుభూతి చెందుతారు" అని మేకర్స్ పేర్కొన్నారు. త్వరలోనే ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. హీరో సిద్దార్థ్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత అదితిరావు ఒప్పుకున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే! ప్రస్తుతం అదితి.. ఓ సాథిరే సిరీస్‌తో పాటు హీరామండి 2 వెబ్ సిరీస్, లయనెన్స్ అనే హాలీవుడ్ సినిమా చేస్తోంది. అదితిరావు- సిద్దార్థ్ 2024లో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ ఇది రెండో పెళ్లి కావడం గమనార్హం.



# దైవం వైపు నాస్తికుడి ప్రయాణం

శ్రీకాళహస్తి స్థలపురాణం ఆధారంగా మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. నాస్తికుడైన కన్నప్ప పరమ శివభక్తుడిగా మారే సంఘటనల నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist.